# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
బుధవారం
26.08.2026

సంపుటి : 16 సంచిక: 330
పేజీలు: 8 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## ధోనీ, సీఎస్కే మధ్య వాటా వివాదం!

ఐపీఎల్‌లో అత్యంత ప్రజాకర్షణ కల్గిన జట్టుగా ఉన్న చెన్నై సూపర్ కింగ్స్‌లో ఆ జట్టు మాజీ సారథి ఎంఎస్ ధోనీ వాటా కొనుగోలు చేస్తున్నాడా? కానీ మహీ డిమాండ్‌కు సీఎస్‌కే మేనేజ్‌మెంట్ ఒప్పుకోవడం లేదా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఈ లీగ్ ఆరంభ సీజన్ నుంచి చెన్నైకి ఆడుతున్న మహీ.. ఆ జట్టుకు ప్రధాన ఆకర్షణ. రికార్డు స్థాయిలో సూపర్‌కింగ్స్‌కు ఐదు ట్రోఫీలను అందించిన ఈ మాజీ కెప్టెన్.. జట్టులో తనకు వాటా కావాలని అడిగినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. జాతీయ మీడియా కథనాల ప్రకారం ధోనీ.. సీఎస్కేలో 25 శాతం వాటా కావాలని కోరగా ఫ్రాంచైజీ యాజమాన్యం మాత్రం 3 శాతమే ఇస్తానని చెప్పినట్టు తెలుస్తున్నది. దీంతో జార్ఖండ్ డైనమైట్ తన డిమాండ్‌ను 20 శాతానికి.. ఆ తర్వాత 18 శాతానికి తగ్గించుకున్నా చెన్నై మేనేజ్‌మెంట్ మాత్రం 5.5 శాతానికంటే ఎక్కువ ఇవ్వలేమని తెగేసి చెప్పినట్టు వినికిడి.

# గురుకులంలో ఘోరం!

## గురుకులంలో విద్యార్థులతో వంట పనులు
## చపాతీలు చేస్తున్న విద్యార్థుల వీడియో వైరల్
## ఉపాధ్యాయుల తీరుపై తీవ్ర విమర్శలు
## ప్రిన్సిపాల్ పర్యవేక్షణపై ప్రశ్నలు
## విచారణకు విద్యార్థి సంఘాల డిమాండ్
## బాధ్యులపై చర్యలకు తల్లిదండ్రుల పట్టుబాటు

**విద్యాబుద్ధులు నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన గురుకుల విద్యాలయం దారి తప్పిందన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో పిల్లలను గురుకులాల్లో చేర్పిస్తారు. మంచి విద్యతో పాటు క్రమశిక్షణ, భద్రమైన వాతావరణం లభిస్తుందని ఆశిస్తారు. అయితే నల్గొండ జిల్లా మిర్యాలగూడ పరిధిలోని గురుకుల మోడల్ పాఠశాలలో వెలుగులోకి వచ్చిన దృశ్యాలు ఆ నమ్మకాన్ని ప్రశ్నిస్తున్నాయి. పుస్తకాలు పట్టాల్సిన విద్యార్థుల చేతులతో వంట పనులు చేయించినట్టు కనిపిస్తున్న వీడియోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా చపాతీలు తయారు చేస్తున్న విద్యార్థుల దృశ్యాలు తీవ్ర చర్చకు దారితీశాయి. విద్యార్థుల సమయాన్ని చదువుకు కేటాయించాల్సిన చోట పనులకు వినియోగించడం సరికాదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని వారు కోరుతున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గురుకుల విద్యా వ్యవస్థపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టేందుకు అధికారులు స్పందించాల్సిన అవసరం కనిపిస్తోంది.**

**చట్టం, స్టేట్ బ్యూరో:**

మిర్యాలగూడ పరిధిలోని గురుకుల మోడల్ పాఠశాలకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి రావడంతో స్థానికంగా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యార్థులు సమూహంగా కూర్చొని చపాతీలు తయారు చేస్తున్న దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. మరికొన్ని దృశ్యాల్లో ఇతర పనుల్లో విద్యార్థులు నిమగ్నమైనట్టు తెలుస్తోంది. ఈ దృశ్యాలు ఎప్పుడు చిత్రీకరించారనే విషయం, విద్యార్థులతో పనులు ఎందుకు చేయించారనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అయినప్పటికీ విద్యార్థుల చేత వంట పనులు చేయించడం నిబంధనలకు విరుద్ధమైతే బాధ్యులపై చర్యలు తప్పవని పలువురు చెబుతున్నారు. పాఠశాలలో వంట కోసం ప్రత్యేక సిబ్బంది ఉన్నారా, సిబ్బంది కొరత కారణంగా విద్యార్థులను పనుల్లోకి దింపారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యార్థుల చదువు, ఆరోగ్యం, భద్రతపై పాఠశాల యాజమాన్యం శ్రద్ధ చూపాల్సి ఉంటుంది. పిల్లలను శ్రమకు వినియోగించారనే ఆరోపణలు నిజమైతే వ్యవహారం మరింత తీవ్రమవుతుంది. అందుకే వీడియోల ఆధారంగా తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా వివరాలు సేకరించి విచారణ జరపాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అధికారులు త్వరగా స్పందించాలి. ఈ వ్యవహారంపై స్పష్టత కోసం తల్లిదండ్రులు వేచి చూస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు విద్య, వసతి, పోషకాహారం, క్రమశిక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఇలాంటి పాఠశాలలకు కుటుంబాల పిల్లలు ఎక్కువగా ఆధారపడుతుంటారు. అందుకే అక్కడి ప్రతి చర్యపై అధికారుల పర్యవేక్షణ కీలకంగా ఉంటుంది. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన స్థానంలో పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలు రావడం



వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ప్రిన్సిపాల్ పర్యవేక్షణ ఎలా ఉంది, వంట సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా, విద్యార్థులకు పనులు అప్పగించడానికి ఎవరు ఆదేశించారు వంటి అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. పాఠశాలల్లో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పిల్లలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. చదువుపై ఆసక్తి తగ్గడం, మానసిక ఒత్తిడి పెరగడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. విద్యార్థులను గౌరవంతో చూసే వాతావరణం ప్రతి గురుకులంలో ఉండాలి. వారి సమయం పుస్తకాలు, ప్రయోగాలు, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలకు ఉపయోగపడాలి. వంట పనులు అవసరమైన సందర్భాల్లో కూడా పిల్లలపై బాధ్యతలు మోపకుండా సిబ్బంది నిర్వహణ ఉండాలి. ఈ ఘటనతో గురుకులాల నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విద్యార్థుల చేత పనులు చేయించిన ఘటనపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గురుకుల మోడల్ పాఠశాలల్లో నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్నది అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నాయి. కేవలం కార్యాలయాల నుంచి నివేదికలు తెప్పించుకోవడం కాకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరుతున్నాయి. పాఠశాలలో విద్యార్థుల కోసం అందుబాటులో ఉన్న సిబ్బంది వివరాలు, వంటశాల నిర్వహణ, భోజన ఏర్పాట్లు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. వైరల్ వీడియోల వెనుక ఉన్న పూర్తి నేపథ్యాన్ని తెలుసుకోవడం కూడా కీలకమే. విద్యార్థులు స్వచ్ఛందంగా ఏదైనా కార్యక్రమంలో పాల్గొన్నారా, లేక బలవంతంగా పనులు చేయించారా అన్నది నిర్ధారించాలి. ఘటనలో తప్పు తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సంఘాలు కోరుతున్నాయి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో మాట్లాడి పాఠశాలలో ఎదురవుతున్న పరిస్థితులను తెలుసుకోవాలని సూచిస్తున్నారు. ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తే సమస్యలు ముందుగానే బయటపడే అవకాశం ఉంటుంది. ప్రతి గురుకులంలో విద్యార్థుల హక్కులను కాపాడే విధానాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని వారు అంటున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ చేపట్టాలన్న డిమాండ్ పెరుగుతోంది. ఘటన నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. గురుకులాల్లో విద్యార్థులే కేంద్రబిందువుగా విధానాలు అమలు కావాలి. వారి చదువు మధ్యలో ఇతర పనులు అడ్డంకిగా మారకూడదు. వంట, శుభ్రత, నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సమర్థంగా వినియోగించాలి. సిబ్బంది కొరత ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. పిల్లలపై భారం మోపడం పరిష్కారం కాదని అధికారులు స్పష్టం చేయాలి. ప్రతి పాఠశాలలో పర్యవేక్షణ రిజిస్టర్, ఫిర్యాదు విధానం, తల్లిదండ్రుల సమావేశాలను బలోపేతం చేయడం అవసరం. విద్యార్థుల గౌరవం, భద్రత, విద్యా హక్కులకు ప్రాధాన్యం ఇవ్వాలి. మిర్యాలగూడ ఘటనపై నిజానిజాలు వెలుగులోకి రావడం కోసం సమగ్ర విచారణ పూర్తిచేసి నివేదికను ప్రజలకు తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు. గురుకులాలపై తల్లిదండ్రులు పెట్టుకున్న విశ్వాసం దెబ్బతినకుండా ప్రభుత్వం వేగంగా స్పందించాల్సిన సమయం ఇదే. విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు ఉండాలి, పనిముట్లు కాదు అన్న సందేశం స్పష్టంగా నిలవాలి.



# కొండా సురేఖ, చిన్నారెడ్డికి ఎసరు.?

- **ఇద్దరిపై క్రమశిక్షణా కమిటీ సీరియస్**
- **పదవుల నుంచి తప్పించాలని సిఫార్సు?**
- **రేవంత్, అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ**
- **పార్టీ ఇమేజ్ దెబ్బతింటోందని నివేదిక**

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (TPCC)కి క్రమశిక్షణా కమిటీ సమర్పించిన నివేదిక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. బీసీ సంక్షేమ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డిలను వారి పదవుల నుంచి తక్షణమే తప్పించాలని కమిటీ తన నివేదికలో స్పష్టంగా సిఫార్సు చేసినట్లు సమాచారం. వీరిద్దరి వైఖరి, వివాదాస్పద వ్యాఖ్యలు , శైలి వల్ల పార్టీకి మాత్రమే కాకుండా, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజల్లో తీవ్ర చెడ్డపేరు వస్తోందని కమిటీ తన నివేదికలో కుండబద్దలు కొట్టింది. సీనియర్ నాయకులుగా ఉండి పార్టీ రహితమైన, వివాదాస్పద రీతిలో ప్రవర్తించడం వల్ల ప్రభుత్వ ఇమేజ్ దెబ్బతింటోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

**పదవుల నుంచి తొలగించాలని సిఫార్సు..**
**అధిష్ఠానం నిర్ణయంపై ఉత్కంఠ**

కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఐక్యతను కాపాడటానికి, ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని క్రమశిక్షణా కమిటీ అభిప్రాయపడింది. అందుకే మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని, అలాగే చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించాలని సిఫార్సు చేస్తూ ఉన్నత స్థాయికి నివేదికను పంపినట్లు తెలుస్తోంది. క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన ఈ కీలక నివేదిక కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారగా, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ అధిష్ఠానం ఏ విధమైన కఠిన నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో నెలకొంది.

**అధిష్ఠానం వద్దకు నివేదిక.. చర్యలపై టీపీసీసీ స్పష్టత**

ఇటీవల జరిగిన ఘటనలతో పాటు, గతంలో చోటుచేసుకున్న వరుస పరిణామాలను సమగ్రంగా విశ్లేషించి ఈ నివేదికలో పొందుపరిచామని కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. "పార్టీలో క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినప్పుడే నాయకులకు, అలాగే పార్టీకి తగిన గౌరవం దక్కుతుంది. ఆ గౌరవం దెబ్బతింటే అది అంతిమంగా పార్టీకే తీరని నష్టం కలిగిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ నివేదికను ప్రస్తుతం టీపీసీసీకి అందజేశామని, అక్కడి నుంచి ఏఐసీసీ (AICC) ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ద్వారా కాంగ్రెస్ అధిష్ఠానానికి చేరుతుందని వెల్లడించారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది పూర్తిగా కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయమేనని మల్లు రవి స్పష్టం చేశారు. అధిష్ఠానం దీనిపై సమీక్షించి ఏ నిర్ణయం తీసుకున్నా, ఆ వివరాలను మీడియా ద్వారా వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో పాన్ మసాలా దందా..
# రూ.160 కోట్ల స్కామ్

- **టిన్ షెడ్‌లో భారీ అక్రమ తయారీ.. 40 ప్యాకింగ్ మెషీన్లు సీజ్**
- **రూ.160 కోట్ల పన్ను ఎగవేత గుట్టురట్టు**
- **కీలక నిందితుడి అరెస్ట్.. 14 రోజుల రిమాండ్**



**చట్టం, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ శివార్లలో ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న ఒక భారీ పాన్ మసాలా, పొగాకు అక్రమ తయారీ కేంద్రాన్ని సెంట్రల్ జీఎస్టీ (CGST) హైదరాబాద్ జోన్ ఇంటెలిజెన్స్ అధికారులు మంగళవారం ఛేదించారు. మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లాలోని ఒక నిర్జన ప్రాంతంలో పెద్ద టిన్ షెడ్‌లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న ఈ తయారీ యూనిట్‌పై దాడి చేసి కోట్ల రూపాయల విలువైన సరుకుతో పాటు యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

**టిన్ షెడ్‌లో తయారీ.. 40 ప్యాకింగ్ యంత్రాలు స్వాధీనం**

మేడ్చల్‌మల్కాజ్‌గిరి పరిధిలో ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ఈ ప్లాంట్‌లో పాన్ మసాలా, సెంటెడ్ జర్దా (పొగాకు) తయారు చేయడానికి సుమారు 56 మంది కార్మికులు పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దాడి సమయంలో సరుకును ప్యాక్ చేసేందుకు ఉపయోగిస్తున్న 40 అక్రమ ఎఫ్ఎఫ్ఎస్ (FFS) పౌచ్ ప్యాకింగ్ మెషీన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో సుమారు 5,500 కిలోల ఫినిష్డ్ స్టాక్, రూ. 76 లక్షల విలువైన రెడీటుడిస్పాచ్ సరుకును సీజ్ చేశారు. వీటితో పాటు తయారీకి సిద్ధంగా ఉన్న 2,015 కిలోల పాన్ మసాలా మిశ్రమం, 810 కిలోలRaw పొగాకును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**రూ.160 కోట్ల GST, సెజ్ ఎగవేత.. ప్యాకింగ్ మెటీరియల్, వాహనాలు సీజ్**

ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ (GST), హెచ్ఎస్ఎన్ఎస్ (HSNS) సెస్‌లతో పాటు సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీని ఎగ్గొట్టి ఈ సరుకును మార్కెట్‌లోకి విక్రయిస్తున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ అక్రమ తయారీ, దొంగతనంగా సరుకు తరలింపుల ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.160 కోట్ల పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. సరుకు రవాణాకు ఉపయోగిస్తున్న రెండు వాహనాలను, భారీ స్థాయిలో ఉన్న ప్యాకింగ్ మెటీరియల్‌ను, పలు కీలక పత్రాలను సీజీఎస్టీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**సూత్రధారి అరెస్ట్.. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్**

ఈ అక్రమ తయారీ కేంద్రాన్ని వెనుక ఉండి నడిపిస్తున్న కీలక నిర్వాహకుడిని అధికారులు అరెస్ట్ చేశారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ కుంభకోణంలో మరికొంతమంది భాగస్వాములు ఉండే అవకాశం ఉందనే కోణంలో సీజీఎస్టీ అధికారులు విచారణను వేగవంతం చేశారు.

## ఫీజు బకాయిలపై బండి సంజయ్ ఫైర్

- **రూ.15 వేల కోట్ల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?**
- **40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుపై ఆందోళన**
- **హామీలిచ్చి మోసం చేశారంటూ కాంగ్రెస్‌పై విమర్శలు**
- **ఫీజు బకాయి.. బీజేపీ లడాయి అంటూ పోరాటం ఉధృతం**



**చట్టం, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక విద్యాసంస్థలకు కనీస బకాయిలు చెల్లించడం చేతగాని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విదేశీ విశ్వవిద్యాలయాలను రప్పిస్తామనడం అత్యంత హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు దాదాపు రూ. 15 వేల కోట్లకు చేరుకోవడంతో వేలాది ప్రైవేట్ కళాశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయని, లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారం**

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, నర్సింగ్ విద్యనభ్యసిస్తున్న దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని బండి సంజయ్ పేర్కొన్నారు. వీరిలో అత్యధికులు దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనని, ఫీజు రీయంబర్స్‌మెంట్ నిలిచిపోవడంతో వీరంతా ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. బకాయిలు రాకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయని, దీంతో విద్యార్థులు పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థులు వివక్షను, అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తోందని మండిపడ్డారు.

**మాట తప్పడంలో బీఆర్ఎస్‌ను మించిపోయిన కాంగ్రెస్**

వన్ టైమ్ సెటిల్‌మెంట్ (OTS) కింద ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలన్నీ చెల్లిస్తామని, నిర్ణీత వ్యవధిలోనే నిధులు విడుదల చేస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని బండి సంజయ్ ప్రశ్నించారు. హామీలిచ్చి మోసం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మించిపోయిందని విమర్శించారు. కళాశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు జీతాలు ఇచ్చుకోలేక, మెయింటెనెన్స్ చార్జీలు భరించలేక తీవ్రమైన అప్పుల ఊబిలో కూరుకుపోయాయని, ఫీజులు అడిగితే బెదిరింపులకు దిగడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని హితవు చెప్పారు.

**"ఫీజు బకాయి – బీజేపీ లడాయి".. పోరాటం ఉధృతం చేస్తాం**

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు చేపట్టిన "ఫీజు బకాయి - బీజేపీ లడాయి" దీక్షకు బండి సంజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, ప్రజా సంఘాల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ. 15 వేల కోట్ల బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో రామచంద్రరావు నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచేదాకా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## నిమ్స్ తరహాలో
# తక్కువ ధరకే వైద్యం.!

- **రోజుకు 600 మందికి ఓపీ సేవలు**
- **త్వరలోనే పూర్తిస్థాయి సర్జరీలకు గ్రీన్ సిగ్నల్**
- **నిమ్స్ తరహాలో చవకైన టారిఫ్‌లు**
- **మల్టీ లెవల్ పార్కింగ్, పీజీ హాస్టళ్లకు ఆమోదం**

**చట్టం, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ వాసులతో పాటు తెలంగాణ నలుమూలల నుంచి వచ్చే రోగులకు అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను మరింత చేరువ చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన మంగళవారం నాడు అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో జరిగింది. ఈ భేటీలో ఆసుపత్రి అభివృద్ధి, కొత్త సేవల ప్రారంభం , మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు ఆసక్తికరమైన నిర్ణయాలకు ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



**త్వరలోనే సర్జరీలు ప్రారంభం.. రోజుకు 600 మందికి ఓపి**

ప్రస్తుతం టిమ్స్ ఆసుపత్రికి ప్రతి రోజూ సగటున 600 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని, వారికి నాణ్యమైన వైద్య సేవలతో పాటు డే కేర్ ప్రొసీజర్లను కూడా అందిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. రోగులకు మెరుగైన ఆపరేషన్ సేవలు అందించేందుకు ఆసుపత్రిలోని ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు , డయాగ్నస్టిక్ పరికరాలను పూర్తిస్థాయిలో స్టెరిలైజేషన్ చేయిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పూర్తిస్థాయి సర్జరీలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

**నిమ్స్ టారిఫ్‌లు, సర్వీస్ రూల్స్ అమలు**

టిమ్స్‌లో వైద్యులు, సిబ్బంది నియామకాల కోసం నిజామ్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) సర్వీస్ రూల్స్‌ను అనుసరించాలని ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నిర్ణయించింది. దీనికి తోడు నిమ్స్‌లో అమలులో ఉన్న చవకైన, సమగ్రమైన టారిఫ్‌లనే టిమ్స్‌లో కూడా అమలు చేయడానికి ఆమోదం తెలిపారు. దీనివల్ల రెండు ప్రధాన ప్రభుత్వ వైద్య సంస్థల మధ్య చార్జీల విధానంలో ఏకరూపత రావడంతో పాటు, సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం తక్కువ ధరకే అందుబాటులోకి రానుంది. అలాగే ఆసుపత్రి ఆర్థిక లావాదేవీలను ట్రస్ట్ అండ్ రిటెన్షన్ అకౌంట్ (TRA) ద్వారా నిర్వహించేందుకు అవసరమైన బ్యాంకింగ్ సేవలను సమన్వయం చేసేందుకు ఈసీ ఆమోదముద్ర వేసింది.

**మల్టీ లెవల్ పార్కింగ్, పీజీ హాస్టళ్ల నిర్మాణం**

రోగులు, వారి సహాయకులు , ఆసుపత్రి సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులను భారీగా విస్తరించనున్నారు. ఆసుపత్రికి వచ్చే వాహనాల కోసం మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటుతో పాటు రోగుల సహాయకుల సౌకర్యార్థం అదనపు టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మించే ప్రతిపాదనలకు ఈసీ ఆమోదం తెలిపింది. అంతేకాకుండా, నిమ్స్ తరహాలోనే టిమ్స్‌లోనూ పీజీ మెడికల్ కాలేజీని ప్రారంభించనున్న నేపథ్యంలో, పీజీ వైద్య విద్యార్థుల కోసం ప్రత్యేక హాస్టళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్‌ను అత్యాధునిక వైద్యం, వైద్య విద్య , పరిశోధనలకు కేంద్ర బిందువుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తదితర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# మెదక్ హెరిటేజ్ టూరిజానికి ప్రత్యేక బ్రాండింగ్

- తొలి టూరిజం అభివృద్ధి కమిటీ సమావేశంలో 10 ఎజెండా అంశాలపై చర్చ
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**చట్టం – మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా హెరిటేజ్ టూరిజం కీర్తిని నలుదిక్కులా చాటే విధంగా ప్రత్యేక లోగో, బ్రాండింగ్‌ను రూపొందించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన తొలి విడత టూరిజం అభివృద్ధి కమిటీ సమావేశంలో జిల్లాలో పర్యాటక అభివృద్ధికి సంబంధించిన 10 ప్రధాన ఎజెండా అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రూ.7 కోట్లతో ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయ పరిసరాల్లో 12 కాటేజీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో స్థల సేకరణ పూర్తి చేసి, నిర్మాణ బాధ్యతలను సంబంధిత శాఖలకు అప్పగించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. మెదక్ ఫోర్ట్ అభివృద్ధిలో భాగంగా భద్రతా ఏర్పాట్లు, సెక్యూరిటీ గార్డుల నియామకం, టూరిస్ట్ గైడ్లు, హౌస్ కీపింగ్, సందర్శకుల టికెట్లు, పార్కింగ్ సౌకర్యాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఫోర్ట్ పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి స్వాధీనంలోకి తీసుకోవడంతో పాటు రక్షణ కంచె ఏర్పాటు చేసి, పార్కింగ్‌కు అనుకూలంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పనుల పర్యవేక్షణ బాధ్యతను మెదక్ మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించాలని కమిటీ నిర్ణయించినట్లు పేర్కొన్నారు. మెదక్ ఫోర్ట్, ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయం, పోచారం, వేల్పుగొండ, నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్ పార్క్ ప్రాంతాల్లో ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేసి సందర్శకులకు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో మొబైల్ ఫుడ్ వాహనాలను అందుబాటులోకి తీసుకురావడంపైనా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. హెరిటేజ్ శాఖ సూచనల మేరకు మెదక్ ఫోర్ట్ సందర్శనకు పెద్దలకు రూ.20, పిల్లలకు రూ.5 టికెట్ ధర నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫోర్ట్ పైభాగానికి వెళ్లే పర్యాటకులకు సౌకర్యంగా బ్యాటరీ వాహనం ఏర్పాటు చేయాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా మెదక్ ఫోర్ట్, పోచారం ప్రాంతాలను ఇటీవల కేంద్ర బృందం సందర్శించినట్లు కలెక్టర్ తెలిపారు. కేంద్రం నుంచి అనుమతి లభిస్తే సుమారు రూ.100 కోట్ల నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నిధులు అందుబాటులోకి వస్తే మెదక్ పర్యాటక రంగాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేసి, సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించవచ్చని పేర్కొన్నారు. ఏడుపాయల ఆలయ పరిసరాల్లో అసైన్డ్ భూములను గుర్తించి ఫుడ్ కోర్టులు, పార్కింగ్ ప్రాంతాల ఏర్పాటుకు అనువైన ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.57 లక్షల నిధులతో హెరిటేజ్ శాఖ పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు రూ.5 లక్షలు, ఇతర మరమ్మతులు, మౌలిక వసతుల కోసం రూ.21 లక్షలు కేటాయించి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. టూరిస్ట్ గైడ్ల నియామకానికి జిల్లా నుంచి ఐదుగురు దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం వారు శిక్షణ పొందుతున్నారని తెలిపారు. శిక్షణ అనంతరం నిబంధనల ప్రకారం నియామకాలు చేపడతామన్నారు. చారిత్రక ప్రాంతాల్లో శిక్షణ పొందిన గైడ్లను అందుబాటులో ఉంచి, పర్యాటకులకు మెదక్ చరిత్ర, వారసత్వ వైభవాన్ని సమగ్రంగా వివరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సెక్యూరిటీ గార్డులను ఏజెన్సీల ద్వారా నియమించేందుకు మెదక్ మున్సిపల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని కమిటీ నిర్ణయించింది. హోమ్ స్టే విధానాన్ని ప్రోత్సహించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలను గుర్తించి శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. మెదక్ జిల్లా పర్యాటక రంగానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సహకారం, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్ సూచనలు, స్వదేశీ దర్శన్ కింద కేంద్ర నిధుల సాధనకు ప్రజాప్రతినిధుల చొరవతో మెదక్ టూరిజం అభివృద్ధి వేగంగా ముందుకు సాగుతోందని ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ జోజి, డీఆర్డీఓ శ్రీనివాసరావు, టూరిజం అధికారి రమేష్, ఈడీఎం సందీప్, డీపీఆర్ఓ రామచంద్ర రాజు, మెదక్ మున్సిపల్ కమిషనర్ నవీన్ పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర పర్యాటక శాఖ సహాయ సంచాలకులు ఓం ప్రకాష్, హెరిటేజ్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ డి. మల్లు, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డీఈ శ్రీశైలం వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు.

## నంగునూర్ జూనియర్ కాలేజీలో ఘనంగా మెగా ప్లాంటేషన్

- పచ్చదనం పెంచుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..
- భవిష్యత్తును కాపాడుదాం సాదుల పవన్ కుమార్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా నంగునూర్ జూనియర్ కాలేజీ ఆవరణలో మంగళవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్, గ్రామ సర్పంచ్ సనాదుల బాల పోచయ్య, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కే. శివకోటి కలిసి కళాశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. నంగునూర్‌ను మరింత పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రజలు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కోల శ్రీధర్ గౌడ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నితీష్ కుమార్,, ఫీల్డ్ అసిస్టెంట్ దేవులపల్లి నర్సింగరావు, బీనబోయిన అశోక్, రాగుల అశోక్, సిర్రం భాను, సీఏలు జహీర్,స్వప్న, సుజాత, లావణ్యతో పాటు గ్రామస్థాయి సిబ్బంది మరియు కళాశాల సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

## మానవాళికి సమానత్వం ఐకమత్యం 'మిలాదున్నబి' ఆగమనం ఖురాన్

- రుస్తుం సుప్రసిద్ధ చిత్రకారులు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** మిలాదున్నబి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో మంగళవారం "సలామే నూరే మిలాదున్నబి" చిత్రాన్ని అంతర్జాతీయ చిత్రకారులు రుస్తుం ఆవిష్కరించారు. అందరికి మిలాదున్నబి ముబారక్ తెలియజేస్తూ, పండుగలు మానవాళిని సంస్కృతి ఐక్యతకు పునరంకితం చేసి మానవ జీవితాలను కళావంతం చేస్తాయి. మిలాదున్నబి మహాప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పుట్టినరోజు. అసమానతలు మద్యపానఅరాచకాలు మూఢనమ్మకాలు రాజ్యమేలుతున్న అరేబియాఎడారిలో జన్మించి మానవత్వం సమానత్వం పరిమళించే ఒయాసిస్సులా మానవాళి మానవతా విలువలను ప్రపంచానికి అనతికాలంలోనే తన గుణగణ ఆచరణలతో శత్రువులను విమర్శకులను సహితం మంత్రముగ్దులను గావిస్తూ ప్రపంచానికి మహా ప్రవక్తగా సన్మార్గ మార్గ దర్శకుడైనాడు. మిలాదున్నబి శాంతి సహజీవనం ఐక్యత అభివృద్ధి అందించాలని ముఖ్యంగా సంయమనంతో ఒకరిభావాలు ఒకరు గౌరవించుకొని మానవాళికి ఆత్మీయభారతం ఐక్యత సహనం ప్రపంచానికి చాటాలని సలాం నూరే మిలాదున్నబి అందరికి సంతోషాలను పంచాలని మానవతా చిత్రకారులు రుస్తుం ఆకాక్షించారు. ఆర్ ఎ ఎఫ్ అధ్యక్షురాలు జులేఖరుస్తుం నైరూప్య చిత్రకారులు నహీంరుస్తుం, అసిస్టెంట్ ప్రొఫెసర్ రుబీనారుస్తుం, మొహ్మద్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు ఎల్ఎఫ్ఎల్ అధ్యక్షులు మల్లారెడ్డి



**చట్టం ఆర్మూర్:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని జిల్లా ఎల్ ఎఫ్ ఎల్ సంఘం అధ్యక్షులు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం రోజు పట్టణ కేంద్రంలోని మైత్రి ఫంక్షన్ హాల్‌లో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు మీసాల వినయ్ కుమార్, పదవీ విరమణ సన్మాన సభకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విధి నిర్వహణలో భాగంగా నిజామాబాద్ జిల్లా జక్రాన్ పల్లి మండలంలోని ఆర్గుల్ గ్రామంలో ఎంపిపి స్కూల్ లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి విద్యార్థులు, గ్రామస్థుల మన్ననలు పొందారని కొనియాడారు. విద్యార్థుల మేధాశక్తిని పెంచే ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు అన్నారు. అంకితభావంతో పనిచేసిన వినయ్ కుమార్, ను ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేయాలన్నారు. అనంతరం ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరికి విరమణ తప్పనిసరని విరమణ పొందుతున్నప్పుడు మనం చేసిన సేవలే మనకు గుర్తింపుగా ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అల్ మాల స్టూడెంట్ అసోసియేసన్ రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్, పిఆర్టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, ఆర్మూర్ డివిజన్ ఇన్చార్జి లక్ష్మణ్ పాటేల్, జక్రాంపల్లి ఎంఈఓ బెజ్జోరా శ్రీనివాస్, ఆర్గుల్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు సుజాత, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు లింగన్న, ఆర్గుల్ సర్పంచ్, ఎంపిపి, ఉపాధ్యాయులు ఏం శైలజ, పి శ్రీలత, జి రవి కుమార్, విద్య వాలెంటర్ కిరణ్మై, బంధు మిత్రులు, ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎబివిపి ఆర్మూర్ నగర నూతన కమిటీ ఎన్నిక



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు కళాశాలలో మంగళవారం రోజు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆర్మూర్ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ హర్షవర్ధన్, మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 1949 జులై 9న ప్రారంభించబడి విద్యార్థుల, విద్యారంగ సమస్యల పైన అలాగే సమాజం పట్ల అనేకమైన కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఏబీవీపీ 1999 కార్గిల్ సమయంలో వీరజవానులకు రక్తం అవసరమైన సమయంలో ఏబీవీపీ కార్యకర్తలు రక్తం ఇచ్చారు అని తెలియజేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఏబీవీపీ కార్యకర్త సామా జగన్మోహన్, జాతీయ జెండా కోసం ఆయన చేసిన ప్రాణ త్యాగాల గురించి విద్యార్థులకు తెలియజేశారు. అలాగే నూతన కమిటీ తెలియజేస్తూ నగర అధ్యక్షుడిగా వెంకటరమణ చారి, అలాగే నగర కార్యదర్శిగా సౌరబ్ ఠాకూర్, లను ఎన్నుకున్నారు. సుమారుగా 30మంది ఏబీవీపీ కార్యకర్తలతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు విభాగ్ ఖేల్ కన్వీనర్ సాయికుమార్, ఆర్మూర్ నగర వైస్ ప్రెసిడెంట్ స్నేహిత్, సిద్ధార్థ్, గంగ ప్రసాద్, ఇతర విద్యార్థి కార్యకర్తలందరూ పాల్గొన్నారు.

## ధమ్మన్నపేటలో భూభారతి రీసర్వే పరిశీలించిన సబ్ కలెక్టర్



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల పరిధిలోని ధమ్మన్నపేట గ్రామంలో జరుగుతున్న 'భూభారతి రీసర్వే' (ఎంజాయ్‌మెంట్ సర్వే) ప్రక్రియను ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, మంగళవారం రోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో సాగుతున్న భూముల సర్వే పనులను దగ్గరుండి చూసిన సబ్ కలెక్టర్, సర్వే రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సర్వే ప్రక్రియను ఎటువంటి పొరపాట్లు లేకుండా, పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే నిర్వహించాలని అధికారులను కోరారు. ఈ పర్యటనలో స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కమ్మర్‌పల్లి తహశీల్దార్ కార్యాలయంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ మంగళవారం రోజు కమ్మర్‌పల్లి మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న 'భూభారతి' రీసర్వే ఫైళ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. భూములకు సంబంధించిన రికార్డులను, సర్వే పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి ఫైళ్లను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మైనార్టీలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

- హరీష్ రావు
- కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలను పదేపదే మోసం చేస్తోందని విమర్శ



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** ఎలాంటి హామీలు ఇవ్వకుండానే మైనార్టీల సంక్షేమానికి కృషి చేసిన ఘనత బీఆర్ఎస్ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మైనార్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పదేపదే వాయిదా వేస్తోందని ఆయన విమర్శించారు. మైనార్టీల కోసం వివిధ పథకాల పేరుతో దరఖాస్తులు స్వీకరిస్తున్నప్పటికీ, వాటి అమలులో స్పష్టత లేదని ఆరోపించారు. కుట్టుమిషన్లు, స్కూటీలు, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు వంటి పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేయిస్తున్నా లబ్ధిదారులకు ప్రయోజనం అందడం లేదని అన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం వెంటనే అవసరమైన బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇమామ్, మౌజన్‌లకు నెలకు రూ.10 వేల సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని కోరారు. షాదీ ముబారక్ పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, ఆ హామీ అమలుపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని అన్నారు. మైనార్టీ విద్యార్థులకు స్కూటీలు, మహిళలకు కుట్టుమిషన్లు అందిస్తామని చెప్పిన పథకాలను కూడా ఆలస్యం చేయకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మైనార్టీల సమస్యలపై కాంగ్రెస్‌లోని మైనార్టీ నాయకులు స్పందించాలని హరీష్ రావు కోరారు. మైనార్టీలకు అన్యాయం జరుగుతున్నప్పుడు వారి హక్కుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. రైతులు, మైనార్టీలు సహా వివిధ వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోందని ఆరోపించిన హరీష్ రావు, ప్రభుత్వం వెంటనే ఎన్నికల హామీలపై కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయకపోతే ప్రజలు రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

## నిజామాబాద్‌లో తెలంగాణ గవర్నర్ పర్యటన

- ఘనంగా స్వాగతం పలికిన ఎంపీ, ఎమ్మెల్యేలు



**చట్టం ఆర్మూర్:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం రోజు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లాకు చేరుకున్న గవర్నర్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సాదర స్వాగతం పలికారు.

**హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం**

హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) హెలిప్యాడ్‌కు చేరుకున్న గవర్నర్‌కు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు. వారితో పాటు జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ఐపిఎస్, ఇతర ఉన్నతాధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

**పర్యటన ముఖ్యాంశాలు.**

**డ్రగ్స్ రహిత సమాజం కోసం పిలుపు.**

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన "నషా ముక్త్ భారత్ అభియాన్" (యాంటీ డ్రగ్స్ అవగాహన) సదస్సులో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి, దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**రైతులతో ముఖాముఖి.**

జాతీయ పసుపు బోర్డు కేంద్ర కార్యాలయాన్ని సందర్శించి, మార్కెట్ లింకేజ్ కార్యక్రమాల్లో పాల్గొని పసుపు రైతులతో గవర్నర్ ప్రత్యేకంగా మాట్లాడారు.

**సేవా కార్యక్రమాలు.**

ధర్మారం రోడ్డులోని పీహెచ్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ (ADF) సేవా కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులను పంపిణీ చేశారు.

## ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరంతర పోరాటం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్



**చట్టం సిద్దిపేట , ప్రతినిధి :** ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల మధ్య విభజన సృష్టించే రాజకీయ కుట్ర జరుగుతోందని జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ మండిపడ్డారు. మంగళవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంటులో చట్టం చేసే వరకు నిరంతరం శాంతియుత పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీజం కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో బీజం పడిందని, ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేసే దిశగా ముందుకు వెళ్తోందని విమర్శించారు. ఎస్సీ రిజర్వేషన్ల ద్వారా ప్రయోజనం పొందుతున్న వర్గాలకు సంబంధించి అధికారిక గణాంకాలు స్పష్టంగా లేకపోయినా, పరిమిత ప్రయోజనాలను సమన్యాయం, సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ కులాల మధ్య ఎలా పంచుతారని ప్రశ్నించారు.
తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఎస్సీ కులాల మధ్య రిజర్వేషన్ ప్రయోజనాలను ఎలా పంచుతారో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ దళితుల ఐక్యతకు విఘాతం కలిగించే చర్యగా మారుతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. మాల సామాజిక వర్గానికి అన్యాయం జరుగుతున్నప్పటికీ ఆ వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు. రాజకీయ పార్టీలకు విధేయత చూపడం కంటే సామాజిక వర్గ ప్రయోజనాల కోసం మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. రిజర్వేషన్ ద్వారా ప్రయోజనం పొందిన మాల ఉద్యోగులు కూడా తమ సామాజిక వర్గ సమస్యలపై స్పందించి ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు.ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన నిర్ణయాలు ఇప్పటికే జరిగిపోయాయని నిరాశ చెందాల్సిన అవసరం లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజా ఉద్యమాల ద్వారా చట్టాలను కూడా మార్చించుకోవచ్చని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మాల సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై అందరూ ఐక్యంగా స్పందించి శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీరం సతీష్‌కుమార్, భీమసేన,నీరెడ్డి శ్రీనివాస్, మాందాపురం రామకృష్ణ, కోదాది శ్రీనివాస్, మీసాల బాలరాజ్, నీరెడ్డి పద్మారావు, నీరెడ్డి కిరణ్, కనకరాజు, వేచల దారా నూకరాజు, అమ్మదాల ఉపేంద్ర, కనికెళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల గొంతుకగా నిలుస్తున్న కప్పర ప్రసాద్ రావు

- ఘనంగా సన్మానించిన రామకోటి రామరాజు
- సమాజ హితం కోసం నిరంతర శ్రమే కప్పర ప్రసాద్ రావు ప్రత్యేకత




**చట్టం సిద్దిపేట (దుబ్బాక) :** తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ (TJU) రాష్ట్ర అధ్యక్షులు, బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు జన్మదినం సందర్భంగా మంగళవారం నాడు శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు, అధ్యక్షులు, భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఘనంగా సన్మానించి సీతారాముల చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత్రికేయుల హక్కులు, సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తూ, సమాజ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో కప్పర ప్రసాద్ రావు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. జర్నలిస్టుల సమస్యలను తన సమస్యలుగా భావించి, వారి సంక్షేమం కోసం నిరంతరం ముందుండి పనిచేస్తున్న ఆయన సేవా తత్వం అమోఘం అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ, పాత్రికేయుల సంక్షేమంతో పాటు సమాజ హితం కోసం మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో TJU ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, అయ్యప్ప దేవాలయం ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వార్షికోత్సవ వేడుకలు



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండలం మదన్ పల్లి గ్రామంలో మంగళవారం రోజు ఎస్సీ వాడాలో శ్రీ లక్ష్మీ నృసింహస్వామి 4వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేద పండితులు మోహన్ శర్మ, పంతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## విద్యార్థులకు పోలీసుల అవగాహన సదస్సు

- డ్రగ్స్, సైబర్ నేరాలపై విద్యార్థులకు హెచ్చరిక



**చట్టం ఆర్మూర్:** మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లి ప్రాంతంలో గల నలంద హై స్కూల్ లో మంగళవారం రోజు విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ సత్యనారాయణ గౌడ్, ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ముఖ్యంగా నాలుగు అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. మత్తు పదార్థాల నిర్మూలన, డ్రగ్స్, గంజాయి వంటి వ్యసనాలకు యువత బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని, మత్తు పదార్థాల రవాణా లేదా వినియోగం కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఆన్‌లైన్ మోసాలు, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, ఓటీపీ (OTP) షేరింగ్, సోషల్ మీడియా వాడకంలో విద్యార్థిని విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమాల పాలన చేయాలని మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.

**షీ టీమ్స్ (SHE Teams) రక్షణ:**

బాలికలు, మహిళల రక్షణ కోసం తెలంగాణ పోలీసులు అందిస్తున్న 'షీ టీమ్స్' సేవలను వివరించారు. వేధింపులకు గురైతే భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ లక్కారం ప్రసాద్, ప్రిన్సిపాల్ లక్కారం సాగర్, అధ్యాపకులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది, షి టీం సభ్యులు విఘ్నేష్, పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ ప్రజలకు శుభవార్త

- రాఖీ పండుగకు సికింద్రాబాద్ నుండి ప్రత్యేక బస్సులు!.



**చట్టం ఆర్మూర్:** రాఖీ పండుగ సందర్భంగా ఆర్మూర్ పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలకు ఆర్టీసీ అధికారులు తీపి కబురు అందించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సికింద్రాబాద్ నుండి ఆర్మూర్‌కు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులు ఆగస్టు 27, 2026 నుండి ఆగస్టు 28, 2026 వరకు అందుబాటులో ఉంటాయి. పండుగ వేళ ప్రయాణికులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఈ ముందస్తు ఏర్పాట్లు చేశారు. ఆర్మూర్ డిపో మేనేజర్ ప్రతిమ రెడ్డి, మాట్లాడుతూ ప్రజలంతా ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఆర్టీసీ బస్సులలో ప్రయాణం ఎల్లప్పుడూ సురక్షితం, సుఖవంతం అని ఆమె పేర్కొన్నారు. బస్సు వివరాలు, ఇతర విచారణల కోసం క్రింది నంబర్లలో సంప్రదించవచ్చు. ఆర్మూర్ డిపో మేనేజర్ సెల్ నంబర్ 9959226019, ఆర్మూర్ బస్ స్టాండ్ విచారణ నంబర్ 7382843133.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

CHATTAM NEWS



## క్రీడా మైదానం వద్ద వన మహోత్సవం కార్యక్రమం

- మొక్కలు నాటిన గాంధారి సర్పంచ్



**చట్టం గాంధారి;** గాంధారి మండల కేంద్రంలోని క్రికెట్ స్టేడియం వద్ద వన మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాంధారి సర్పంచ్ మమ్మాయి రేణుక సంజీవ్ యాదవ్, ఎంపీడీవో రాజేశ్వర్, అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో క్రికెట్ స్టేడియంలో మొక్కలు నాటారు. మొక్కలు నాటుదాం, పర్యావరణాన్ని కాపాడుదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాంధారి సర్పంచ్, ఎంపీడీవో, అటవీ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## కంది పంటలో మొగ్గ తుంచే విధానం పై క్షేత్ర ప్రదర్శన

- తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం మల్తు మ్మొద్ శాస్త్రవేత్త



**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని సిరి సముందర్ గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ సౌజన్యంతో కంది పంటలు మగ్గతుంచే విధానంపై రైతులకు క్షేత్ర ప్రదర్శన చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, మాల్తుమ్మెద శాస్త్రవేత్త రేవంత్ రైతులకు కంది పంటలో కొన మొగ్గ తుంచడం వల్ల కొమ్మలు పెరిగి తద్వారా పూత మరియు కాయల సంఖ్య పెరిగి, తద్వారా దిగుబడులు పెంచుకోవచ్చని సూచించడం జరిగింది. అదేవిధంగా మొగ్గ తుంచే విధానం పాటించడం వల్ల మొక్కల ఎత్తు తక్కువగా పెరిగి పురుగుమందుల పిచికారి సులభతరం అవుతుందని రైతులకు సూచించారు. అనంతరం గ్రామంలోని సోయాబీన్ మరియు కంది పంటలను పరిశీలించి రైతులకు సోయాబీన్ పంటలో కాండం తొలిచే పురుగు మరియు కంది పంటలో మారుక మచ్చల పురుగు నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, మాల్తుమ్మెద శాస్త్రవేత్త రేవంత్ గారు, మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, వ్యవసాయ విస్తరణ అధికారి దయానంద్ మరియు రైతులు పాల్గొన్నారు.

## మిలాద్ఎఉన్నబీ పండగ సందర్భంగా జుక్కల్ పోలీస్ స్టేషన్ లో శాంతి కమిటీ సమావేశం



**చట్టం జుక్కల్ ;** మిలాద్ఎ ఉన్ నబి పండగ సందర్భంగా మంగళవారం రోజు జుక్కల్ పోలీస్ స్టేషన్ లో సిఐ రవికుమార్ ఎస్సై మురళి ఆధ్వర్యంలో జుక్కల్ ముస్లిం సోదరులు, నాయకులతో శాంతి కమిటీ సమావేశం ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ ఈ పండగను మత సామరస్యంగా మంచి వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయానికి లోనూ కాకుండా పండగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. మైనార్టీ సంఘం అధ్యక్షుడు ఎండి షాదుల్ మాట్లాడుతూ శాంతియుతంగా జరిగేలా చూస్తామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ ఉపసర్పంచ్ షేక్ ఫిర్దోస్ మైనార్టీ సంఘం అధ్యక్షులు MD షాదుల, మిలాద్ సంఘం Sd షకీల్, సైమ్ ఖాన్, జునైద్, ఎస్టీ కరీం, SK ఇర్ఫాన్, మెహబూబ్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## పడంపల్లి గ్రామంలో లో ఘనంగా వనమహోత్సవం



**చట్టం జుక్కల్;** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం పడం పల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వనమోత్సవ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వాగు మారి విజయ్ కుమారి సంజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... చెట్లు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా, వర్షాలు కురవడానికి, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ఎంతో సహాయపడతాయని అన్నారు ప్రస్తుతం అడవుల నరికివేత, కాలుష్యం మరియు వాతావరణ మార్పుల వల్ల ప్రకృతికి తీవ్ర నష్టం జరుగుతోంది. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపిన సర్పంచ్ తెలిపారు గ్రామంలోని ప్రతి ఒక్కరూ నాయకులు. ప్రజా ప్రతినిధులు అధికారులు తమ ఇంటి ఆవరణలో మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఒక మొక్క నాటడం అంటే భవిష్యత్ తరాలకు ఒక మంచి జీవితాన్ని అందించడ అనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలన్నారు. వనమహోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని కోరుకుంటున్నమని చెట్లను కాపాడుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం భవిష్యత్ తరాలకు మంచి భూమిని అందిద్దామని సర్పంచ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు పంచాయతీ కార్యదర్శి గంగాధర్ ఉప సర్పంచ్ అసిస్టెంట్ల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

## బాసర మండల కేంద్రంలో ఘనంగా వనమహోత్సవం



**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వనమహోత్సవ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ తీగల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ చెట్లు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా వర్షాలు కురవడానికి, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అడవుల నరికివేత, కాలుష్యం, వాతావరణ మార్పుల కారణంగా ప్రకృతికి తీవ్ర నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు అవి పెద్ద చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తమ ఇంటి ఆవరణలో కనీసం ఒక మొక్కను నాటాలని సూచించారు. "ఒక మొక్క నాటడం అంటే భవిష్యత్ తరాలకు మంచి జీవితాన్ని అందించడం" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. వనమహోత్సవం సందర్భంగా కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని కోరారు. చెట్లను కాపాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించి భవిష్యత్ తరాలకు మంచి భూమిని అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపీడీఓ దేవేందర్, సీఐ దీపక్, గ్రామపంచాయతీ ఈవో ప్రసాద్ గౌడ్, ఎంపీఓ గంగాసింగ్, ఏపీఓ సదానంద చారి, సాంకేతిక సిబ్బంది, క్షేత్ర సహాయకులు, వార్డు సభ్యులు, పోలీస్, రెవెన్యూ, ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువులో సూదుల కలకలం.. పంట పొలాలపై ముప్పు

- అలుగు నీటిలో కొట్టుకొస్తున్న వాడిన ఇంజక్షన్ సూదులు.. రైతుల్లో ఆందోళన!



**చట్టం/ ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి పెద్దచెరువు అలుగు వద్ద పారేసిన ఇంజక్షన్ సూదులు, వైద్య వ్యర్థాలు కలకలం రేపుతున్నాయి. మినీ ట్యాంక్‌బండ్ మొదటి బ్రిడ్జి సమీపంలో పడేసిన సూదులు.. ఎగువ పోచారం ప్రాజెక్టు నుంచి నీరు రావడంతో పెద్దచెరువు అలుగు పారుతుండగా.. అలుగు మధ్యలో వాడి పారవేసిన ఇంజక్షన్ సూదులు ఒక్కొక్కటిగా నీటి ప్రవాహంలో పంట పొలాల వైపు కొట్టుకొస్తున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రైతుల ఆరోగ్యం, పశువులు, పంట పొలాల భద్రత దృష్ట్యా ప్రమాదకర వ్యర్థాలను తక్షణమే తొలగించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రైతులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## సాగునీటి పనులకు నిధులు మంజూరు చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆది శ్రీనివాస్ వినతి

- పలు అభివృద్ధి పనులపై వినతిపత్రం సమర్పించిన ప్రభుత్వ విప్
- సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాష్ట్రంలోని పలు సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు, వంతెనలు, భూసేకరణ పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. హైదరాబాద్‌లోని జల సౌధలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆది శ్రీనివాస్ పలు అభివృద్ధి పనులపై చర్చించి వినతిపత్రం సమర్పించారు. మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ముఖ్యంగా సంకెపల్లి ప్రాంతంలో 18 సంవత్సరాలు నిండిన అర్హులైన నిర్వాసితులకు, ప్రభావిత దేవాలయాలకు పరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మల్కపేట ప్రాజెక్టు ప్యాకేజీ-9, ఎగువ మానేరు, కుడి-ఎడమ ప్రధాన కాలువల పరిధిలో అవసరమైన చోట భూసేకరణ చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా ఆసిరెడ్డిపల్లి కొచ్చెరువు, సనుగుల ఎర్రచెరువు, పటేల్ చెరువులకు నీటిని విడుదల చేసి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కథలాపూర్ వరద కాల్వ 52వ కిలోమీటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం, ఎస్సారెస్పీ కాల్వ మాచాపూర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. వరద కాల్వ 62వ కిలోమీటర్ వద్ద క్రాస్ రెగ్యులేటర్ ఏర్పాటు చేయడంతో పాటు కొండాపూర్-మేడిపల్లి గ్రావిటీ కెనాల్ భూసేకరణకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆది శ్రీనివాస్ ప్రస్తావించిన సాగునీటి సమస్యలు, అభివృద్ధి పనులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఇటీవల కలికోట సూరమ్మ ప్రాజెక్టు, కాలువల నిర్మాణానికి రూ.80 కోట్ల నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆది శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నిజామాబాద్‌లో ఘనంగా ఖేలో ఇండియా అస్మిత సూపర్ లీగ్ సెపక్‌తక్రా టోర్నమెంట్




**చట్టం – నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్‌లోని ప్రెసిడెన్సీ స్కూల్‌లో ఖేలో ఇండియా అస్మిత సూపర్ లీగ్ సెపక్‌తక్రా టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రెసిడెన్సీ స్కూల్, గిరిరాజ్ విద్యాసంస్థలకు చెందిన సుమారు 100 మంది జూనియర్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఎన్. శామతా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆర్. శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి) అబ్జర్వర్ ప్రీతా ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి. సంజీవ రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భాగారెడ్డి, ఇంటర్నేషనల్ ప్లేయర్ దీపిక, సురేష్, రాజిత, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, లక్ష్మణ్ కుమార్, పవన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, 2036 ఒలింపిక్ గేమ్స్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన అస్మిత కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభను పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

**విజేతలు**

**ప్రథమ బహుమతి:** గిరిరాజ్ కళాశాల
**ద్వితీయ బహుమతి:** ప్రెసిడెన్సీ హై స్కూల్
**తృతీయ బహుమతి:** ప్రెసిడెన్సీ స్కూల్

విజేతలకు ఎన్. శామతా రెడ్డి, సాయి అబ్జర్వర్ ప్రీతా, ఆర్. శ్రీనివాస్ రెడ్డి, జి. సంజీవ రెడ్డి, భాగారెడ్డి బహుమతులు అందజేశారు. తెలంగాణ సెపక్‌తక్రా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఆర్. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రెసిడెన్సీ స్కూల్‌లో ఖేలో ఇండియా అస్మిత సూపర్ లీగ్ సెపక్‌తక్రా పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రీడలపై మరింత ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన ప్రెసిడెన్సీ స్కూల్ యాజమాన్యం, సెపక్‌తక్రా అసోసియేషన్ ప్రతినిధులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులను అతిథులు అభినందించారు.

## బిచ్కుంద మండలంలో గ్రామ సభల నిర్వహణ

**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని సమస్త రాజకీయ పార్టీ అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లు (BLA), ప్రజాప్రతినిధులు, సమస్త BLOలకు, పాత్రికేయులకు, ప్రజలందరికీ ప్రెస్ నోట్... ముఖ్య ఎన్నికల అధికారి (CEO) ఆదేశాల మేరకు, తేది 27.08.2026 (గురువారం) నాడు బిచ్కుంద మండల పరిధిలోని సమస్త BLOలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి సంబంధించిన గ్రామంలో గ్రామ సభ నిర్వహించబడుతుంది. ఈ సభలో SIR ముసాయిదా ఓటర్ల జాబితా మరియు Uncollectible ఓటర్ల జాబితా ప్రజల సమక్షంలో చదివి వినిపించబడుతుంది. జారీ చేయబడిన నోటీసులకు, తగు సంబంధిత ఆధారాలతో విచారణ తేదీలో హాజరు కావాలని తెలుపుతుంది. (నోటీసుల యొక్క విచారణ తేదీ మరియు ప్రదేశ వివరాలు పోలింగ్ స్టేషన్ వారీగా జతపరచబడినవి)



కావున, మండలంలోని రాజకీయ పార్టీ ప్రతినిధులు, BLAలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలందరూ తేది 27.08.2026 న జరిగే ఆ గ్రామ సభలలో పాల్గొని, విచారణ చేరలో మీ యొక్క గ్రామ పంచాయతీ కార్యాలయములో, మున్సిపాలిటీ పరిధిలోని ఓట్లు, పాత మున్సిపల్ కార్యాలయం, బిచ్కుంద యందు హాజరయ్యి, మీ యొక్క ఓటుకు సంబంధించి నోటీసులకు వివరాలు ఇచ్చి ఓటు నమోదుకు సహకరించవలసిందిగా కోరడమైనది

1. ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చబడిన అన్ని ఓటర్ల పేర్లను బూత్ లెవెల్ ఆఫీసర్ బి ఎల్ ఓ బహిరంగంగా చదివి వినిపించాలి
2. ఏ కారణం చేతనైనా ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు చేర్చబడకుండా మిగిలిపోయిన భారతీయ పౌరుల వివరాలను గుర్తించాలి
3. 01.10.2026 నాటికి 18 సంవత్సరాల వయసు పూర్తి చేసుకునే భారతీయ పౌరులు తమ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు వారం 6 తో పాటు డిక్లరేషన్ ఫారం మరియు అవసరమైన పత్రాలను సమర్పించమని కోరాలి
4. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏదైనా తప్పు వ్యత్యాసం గుర్తించబడితే సంబంధిత వ్యక్తి ఫారం 8 తో పాటు డిక్లరేషన్ ఫారం మరియు అవసరమైన ఆధార్ పత్రాలను సమర్పించమని కోరాలి
5. ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చబడినప్పటికీ ఏ కారణం చేతనైనా ఓటరుగా ఉండేందుకు అనర్హులైన వ్యక్తులను గుర్తించాలి సంబంధిత వ్యక్తి అదే నియోజకవర్గంలో ఓటరుగా ఉండి డిక్లరేషన్ ఫారం తో పాటు ఫారం 7 ను సమర్పించాలి
6. క్లేయిమలు, అభ్యంతరాలు మరియు ధ్రువీకరణకు నిర్దేశించిన కాలంలో భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మరియు అవసరమైన పత్రాలకు సంబంధించి చర్చ నిర్వహించాలి
7. ఎల్ కోటరల రోల్ కు సంబంధించిన ప్రత్యేక సమగ్ర సవరణ లోని ఇతర అంశాలను కూడా చర్చించాలి అయిన అంశాలను సమావేశపు మినిట్స్ లో నమోదు చేసి అధికారిక రికార్డు నిమిత్తం భద్రత పరిచేలా చర్యలు తీసుకోవాలి

## సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన నిర్మల్ జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల




**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ సారంగాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు, సిబ్బంది విధుల నిర్వహణ, కేసు డైరీలు, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి, చట్టపరంగా సత్వర పరిష్కారం చూపాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నిబంధనల ప్రకారం నమోదు చేసి, ఫిర్యాదుదారులకు కేసు పురోగతిపై తగిన సమాచారం అందించాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, రాత్రి గస్తీని ముమ్మరం చేసి దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా కొనసాగించాలని సూచించారు. మహిళలు, బాలల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. బీట్ వ్యవస్థను పటిష్టం చేసి గ్రామాల్లో పోలీసులు నిరంతరం పర్యటించాలని సూచించారు. డయల్ 112 ద్వారా వచ్చే సమాచారంపై వెంటనే స్పందించి బాధితులకు సహాయం అందించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, ఇతర రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. ఈ తనిఖీలో డీఎస్పీ శ్రీనివాస్, నిర్మల్ రూరల్ సీఐ కృష్ణ, సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రామంతపూర్‌లో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక



**చట్టం – మెదక్ ప్రతినిధి :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మెదక్ జిల్లా మాసాయిపేట మండలం రామంతపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎంఎస్ అనుబంధ సంఘాల గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా నాయకురాలు మాధవి పల్లెపాటి మాదిగ, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నూతన గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంఘ నిర్మాణ కార్యక్రమాల్లో మహిళలు అన్ని రంగాల్లో మరింత ముందుకు రావాలని నాయకులు పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో చేపట్టే సామాజిక ఉద్యమాలకు మహిళలు సిద్ధంగా ఉండాలని సూచించారు. కమిటీ ఎన్నికల్లో కట్ట పద్మ మాదిగను మండల అధ్యక్షురాలిగా, ముక్క జ్యోతి మాదిగను మండల అధికార ప్రతినిధిగా ఎంపిక చేశారు. గ్రామస్థాయి నుంచి మండల నాయకత్వానికి వీరిని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మాదిగ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంఘ బలోపేతం, మహిళల భాగస్వామ్యం, సామాజిక ఉద్యమాల ప్రాధాన్యతపై చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా నాయకురాలు మాధవి పల్లెపాటి మాదిగ, తప్పేట పుష్ప మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బిచ్కుంద మున్సిపాలిటీలో లో ఘనంగా వనమహోత్సవం



**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వనమోత్సవ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ షేక్ హయూమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ... చెట్లు మనకు ప్రాణవాయువును అందించడమే కాకుండా, వర్షాలు కురవడానికి, పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి ఎంతో సహాయపడతాయని అన్నారు ప్రస్తుతం అడవుల నరికివేత, కాలుష్యం మరియు వాతావరణ మార్పుల వల్ల ప్రకృతికి తీవ్ర నష్టం జరుగుతోంది. అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని కమిషనర్ తెలిపారు మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరూ నాయకులు. ప్రజా ప్రతినిధులు అధికారులు తమ ఇంటి ఆవరణలో మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఒక మొక్క నాటడం అంటే భవిష్యత్ తరాలకు ఒక మంచి జీవితాన్ని అందించడ అనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలన్నారు. వనమహోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని కోరుకుంటున్నమని చెట్లను కాపాడుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం భవిష్యత్ తరాలకు మంచి భూమిని అందిద్దామని కమిషనర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి ప్రేమ్ సెట్ కౌన్సిలర్ నౌషా నాయక్ మునిసిపల్ ఆప్షన్ నెంబర్ హనుమాన్లు మున్సిపాలిటీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

## యంగ్ ఇండియా పాఠశాలను జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలి

- టిఎన్ఎస్ఎఫ్,టిజెఎస్,టి ఎన్విఎస్



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి నియోజకవర్గానికి కేటాయించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మరియు ఏటిసి (అడ్వాన్సుడ్ టెక్నాలజీ సెంటర్స్ ను) కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూములలో ఏర్పాటు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు,టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కంబాల లక్ష్మణ్ యాదవ్,విద్యార్థి జిల్లా అధ్యక్షుడు వినయ్ లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలు టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాలు, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్ లు మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మరియు ఏటీసీ విద్య సంస్థలను కామారెడ్డి డిగ్రీ కళాశాల భూములలో ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,రవాణా సదుపాయాలు,మౌలిక వసతులు లేని చోట వీటిని ఏర్పాటు చేస్తే వాటి లక్ష్యం దెబ్బతింటుందని ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో విద్యాసంస్థలు ఏర్పాటు చేయడానికి డిగ్రీ కళాశాల భూములు రిజిస్ట్రేషన్ కాలేదని ఇప్పుడు కళాశాల పేరు మీద భూములు ఉన్నప్పటికీ దూర ప్రాంతాల్లో ఈ విద్యాసంస్థలు ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతులు విద్య సంస్థలు ఏర్పాటు కావాలని ఇచ్చిన భూములను నిరుపయోగంగా ఉంచి విద్యార్థులకు నష్టం చేస్తున్నారని అన్నారు. విద్యాసంస్థలు జిల్లా కేంద్రానికి వచ్చేంతవరకు పోరాటం చేస్తామని దానికి అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు సహకరించాలని లేకపోతే నిరవధిక దీక్షలను చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు వినయ్ రాజు సందీప్ సతీష్ మధు రాహుల్ నవనీత్ లు పాల్గొనడం జరిగింది.

## ఎంపీ ధర్మపురి అరవింద్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు



**చట్టం / నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు, బీజేపీ సీనియర్ నేత ధర్మపురి అరవింద్ జన్మదిన వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఎడపల్లి మండలం జానకంపేట గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీ అరవింద్‌కు ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని, రాజకీయంగా మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, రాష్ట్ర, కేంద్రంలో కీలక పదవులు చేపట్టాలని కోరుకుంటూ స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. ధర్మపురి అరవింద్ నిజామాబాద్ ఎంపీగా రెండోసారి గెలిచిన తర్వాత జిల్లా రూపురేఖలు మార్చారని కొనియాడారు. ముఖ్యంగా రైతుల చిరకాల కోరిక అయిన జాతీయ పసుపు బోర్డును నిజామాబాద్ కు తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, దీనివల్ల లక్షలాది మంది పసుపు రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. అలాగే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ద్వారా జిల్లాకు అనేక అభివృద్ధి పనులు, నిధులు తీసుకువచ్చిన ఘనత ఆయనదేనని, ఎప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడు అరవింద్ అని వారు తెలిపారు. ఆయన నాయకత్వంలో నిజామాబాద్ జిల్లాలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ యువ నాయకులు కూరెల్ల శ్రీధర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు సూర కిరణ్, సీనియర్ నాయకులు గెంటె శ్రీనివాస్, కోస్లి ఉప సర్పంచ్ కృష్ణ, మురళి, చిలుక ప్రవీణ్, గుండా శ్రీనివాస్, సృజన్ తదితర బీజేపీ కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నెలాఖరులోగా 17 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

▶ **ఇప్పటివరకు 12 లక్షలకు పైగా మొక్కలు నాటాం: జిల్లా కలెక్టర్ కె. హైమావతి**



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** ఈ నెలాఖరులోగా నిర్దేశిత లక్ష్యం మేరకు సిద్దిపేట జిల్లాలో 17 లక్షల మొక్కలు నాటుతామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఈతవనంలో ఈత, యాప మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లాలో వనమహోత్సవం ద్వారా 17 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 12 లక్షలకు పైగా మొక్కలు నాటినట్లు తెలిపారు. మెగా వనమహోత్సవంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే రెండున్నర లక్షలకు పైగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. నెలాఖరులోగా 17 లక్షల మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎల్నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం తక్కువగా ఉన్న నేపథ్యంలో వరి పంటకు ప్రత్యామ్నాయంగా మెట్ట పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ముఖ్యంగా కంది, జనుము, వేరుశనగ, తృణ ధాన్యాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు వీబీజీ రాంజీ పథకం కింద రైతులు తమ పంట పొలాల్లో ఉచితంగా ఫామ్ పాండ్లు నిర్మించుకోవాలని సూచించారు. గ్రామంలోని వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులను ఫామ్ పాండ్ల నిర్మాణం వైపు ప్రోత్సహించాలని గ్రామ సర్పంచ్ కృష్ణను సూచించారు. వనమహోత్సవంలో మొక్కలు నాటిన ప్రాంతంలో విస్తారమైన భూమి అందుబాటులో ఉన్నందున అక్కడ కమ్యూనిటీ ఫామ్ పాండ్ నిర్మించాలని వీబీజీ రాంజీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ప్రియా, ఏడీ సర్వే ల్యాండ్ సదర్శన్, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చట్టం రిపోర్టర్ ను పరామర్శించిన ఎమ్మెల్యే



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** పరకాల పట్టణానికి చెందిన చట్టం దినపత్రిక రిపోర్టర్ ఒడెల శివకుమార్ తండ్రి ఒడెల భిక్షపతి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఒడెల భిక్షపతి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా భిక్షపతి కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఆయన మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని ఆయన చెప్పారు.

## మోడల్ స్కూల్లో ఘనంగా రక్షాబంధన్ కార్యక్రమం



**చట్టం కథలాపూర్:** భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో కథలాపూర్ మోడల్ స్కూల్లో రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, విద్యార్థులందరికీ రాఖీలు కట్టించి రక్షాబంధన్ పండుగ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా "నీకు నేను రక్ష.. నాకు నువ్వు రక్ష.. మనిద్దరం దేశానికి రక్ష" అనే సందేశాన్ని విద్యార్థులకు తెలియజేస్తూ, దేశ రక్షణలో ప్రతి ఒక్కరి బాధ్యత ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు ఆరె శివకుమార్, బీజేవైఎం జిల్లా నాయకులు కాసోజి ప్రతాప్, మల్యాల శ్రీకర్, తోకల వినోద్, ముంజ వెంకటేష్, సునీల్, సురేష్, రూపేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలి

▶ **కొండం సంజీవ్ కుమార్**

▶ **అర్హులందరికీ తక్షణమే కార్డులు అందించాలని సీపీఎం డిమాండ్**



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట పట్టణంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే నివారించి, అర్హులైన ప్రతి కుటుంబానికి కార్డులు అందించాలని సీపీఎం అర్బన్ నాయకుడు కొండం సంజీవ్ కుమార్ డిమాండ్ చేశారు. ముఖ్యంగా పట్టణంలోని 19వ వార్డులో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం కార్డులు మంజూరు చేసినప్పటికీ పంపిణీ ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. రేషన్ కార్డు కేవలం గుర్తింపు పత్రం మాత్రమే కాదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకులు పొందేందుకు పేద కుటుంబాలకు కీలకమని తెలిపారు. 19వ వార్డులో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి కార్డు అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్మార్ట్ రేషన్ కార్డుల వివరాలను పరిశీలించి, పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సిద్దిపేట పట్టణవ్యాప్తంగా కార్డుల పంపిణీని వంద శాతం పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వార్డుల వారీగా పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి, అర్హులైన లబ్ధిదారులకు అక్కడే కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. "అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందడం వారి హక్కు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సౌకర్యాలకు దూరం కాకూడదు. 19వ వార్డుతో పాటు సిద్దిపేట పట్టణంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని తక్షణమే పూర్తి చేయాలి" అని కొండం సంజీవ్ కుమార్ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి స్పందన లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి అధికారుల దృష్టికి సమస్యను మరింత బలంగా తీసుకెళ్తామని తెలిపారు.

## మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సహనం, శాంతి, దయ మరియు సోదరభావాన్ని ప్రవక్త చాటారని ఆయన కొనియాడారు. ముహమ్మద్ ప్రవక్త ప్రజలకు ఐక్యత మరియు మానవ సేవ సందేశాన్ని అందించారన్నారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు, మత సామరస్యం సమాజానికి ఆదర్శమన్నారు. ఈ పండుగ ప్రతి ఒక్కరినీ ఆయన బోధనలను ఆకళింపు చేసుకుని, సమాజంలో శాంతి సామరస్యాలను పెంపొందించడానికి ప్రేరేపిస్తుందన్నారు. ప్రజలు ముహమ్మద్ ప్రవక్త బోధనల నుండి స్ఫూర్తి పొంది, ప్రేమ మరియు సోదరభావ స్ఫూర్తితో కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అల్లా దయతో ప్రపంచమంతా శాంతియుతంగా ఉండాలని కోరుకుంటున్నానన్నారు.

## బాధిత కుటుంబాలకు గ్రామస్తుల ఆర్థిక సాయం.. మనోధైర్యం



**చట్టం – నసురుల్లాబాద్ :** గ్రామంలో ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సాయం అందించడం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు కలిసి బాధిత కుటుంబాలకు తమ వంతు సహాయం అందిస్తూ "మేమున్నాం" అంటూ మనోధైర్యం కల్పిస్తున్నారు. కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో గత కొంతకాలంగా గ్రామంలో ఎవరైనా అనారోగ్యం లేదా ఇతర కారణాలతో మృతి చెందితే, సమాచారం అందిన వెంటనే గ్రామస్తులు స్పందించి బాధిత కుటుంబానికి తోచినంత ఆర్థిక సాయం అందిస్తున్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు ధైర్యం చెప్పడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉల్లెంగ పరువయ్య కుటుంబానికి మంగళవారం గ్రామస్తులు సేకరించిన రూ.9,100 ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టకాలంలో గ్రామమంతా అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ నిందితుడి అరెస్ట్




**చట్టం రామకృష్ణాపూర్:** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని తాళం వేసిన ఇంట్లో దొంగ చొరబడి వెండి ఆభరణాలు అపహరించిన నిందితుడిని పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే...పట్టణ ఎస్సై జాడి శ్రీధర్ తెలిపిన ప్రకారం తిమ్మాపూర్ గ్రామంలోని పద్మావతి కాలనీకి చెందిన రెడ్డిమల్ల శోభారాణి ఈ నెల 20న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని కుమార్తె ఇంటికి వెళ్లారు. తాను ఆగస్టు 24న తిరిగి వచ్చి చూడగా ఇంటి ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించారు. నిందితుడు ఇంట్లోని అల్మారాలోని 1½ తులాల వెండి గొలుసు, 6 తులాల ముడి వెండి, 3 తులాల వెండి నాణేలు, బంగారు పుస్తె గుండు కనిపించకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు పట్టణ ఎస్సై నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు. మంగళవారం ఉదయం తిమ్మాపూర్ చౌరస్తాలోని కేక్ జోన్ బేకరీ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యక్తి తప్పించుకునేందుకు యత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా మందమర్రి 3వ జోన్‌కు చెందిన సిరికొండ శంకర్ (38) గా గుర్తించారు. నిందితుడు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ న్యూ తిమ్మాపూర్‌లో నివాసముంటున్నట్లు ఎస్సై తెలిపారు. జల్సాలు, వ్యక్తిగత అవసరాల కోసం చోరీకి పాల్పడినట్లు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రజలు ఇళ్లకు పటిష్ఠంగా తాళాలు వేసుకోవాలని, ప్రయాణ వివరాలను పొరుగువారికి లేదా పోలీసులకు తెలియజేయాలని ఎస్సై సూచించారు.

## మెదక్‌లో బాలసాహిత్య సృజన కార్యశాల

▶ **ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ హేమలత చేతుల మీదుగా 'రచనా కళ' పుస్తకావిష్కరణ**




**చట్టం – మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లాలో తొలిసారిగా పాఠశాల సముదాయ సమావేశంలో బాలసాహిత్య సృజన కార్యశాల నిర్వహించారు. శాంతా-వసంతా ట్రస్ట్, తెలంగాణ సారస్వత పరిషత్తు హైదరాబాద్ సౌజన్యంతో కూచన్‌పల్లిలో నిర్వహించిన ఈ సృజనాత్మక సాహిత్య కార్యశాలలో విద్యార్థుల రచనా నైపుణ్యాలను పెంపొందించే 'రచనా కళ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. హవేలీ ఘణపూర్, మెదక్, కొల్చారం మండలాలకు చెందిన తెలుగు పాఠశాల సముదాయ సమావేశంలో ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ హేమలత, ఎంఈఓ మధుమోహన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ మాతృభాష అన్ని భాషలకు మూలాధారమని, చిన్నతనం నుంచే విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మక రచనపై ఆసక్తి పెంపొందించాలని సూచించారు. ఎంఈఓ మధుమోహన్ మాట్లాడుతూ పాఠశాలల్లో తెలుగు భాషోపాధ్యాయుల సేవలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థుల రచనా సామర్థ్యాన్ని పెంచేందుకు ఉపయోగపడే 'రచనా కళ' పుస్తకం అన్ని పాఠశాలల గ్రంథాలయాల్లో అందుబాటులో ఉండాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆర్పీలు ఉండ్రాళ్ల రాజేశం, ఎల్లయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ, శశికుమార్, అశోక్, ఉస్మాన్, రాజు, నరేష్, యాదగిరి, రామానుజ, శ్రీలత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఉట్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో వనమహోత్సవ కార్యక్రమం ఓ పండుగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఉట్లపల్లి అటవీ శాఖ, ప్రజాప్రతినిధులతో పాటు పలు శాఖల అధికారులు భాగమయ్యారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది భాగస్వామ్యంతో మొక్కల పెంపకం ప్రాముఖ్యతను తెలియజేశారు. గ్రీన్ ఇండియా కలను నెరవేర్చే దిశగా గ్రామ ప్రజలు, స్థానికులు ముందడుగు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మొక్కలు నాటి 'వన మహోత్సవ' కార్యక్రమంకు ప్రోత్సాహం కలిగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కను భవిష్యత్ తరాలకు ప్రాణవాయువును అందించే జీవనదాతగా భావించి, పొత్తిళ్లలో పెట్టుకుని కాపాడుకున్నంత అపురూపంగా వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎస్. లక్ష్మి కుమారి, రామకృష్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ వీరభద్రం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సత్యనారాయణ, ఎంపీవో రామ్ రెడ్డి, జూపల్లి ప్రమోద్, కౌన్సెలర్ హరిబాబు, దివాకర్, కోలా లక్ష్మి నారాయణ, కాసాని పద్మ శేఖర్, అడవి శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

▶ **ముస్తాబైన ప్రార్థన మసీదులు**



**చట్టం గాంధారి;** గాంధారి మండల కేంద్రంలోని జామ మస్జిద్, మస్జిద్ చుమన్ షా వలి మసీదుల్లో మంగళవారం రాత్రి ముస్లిం సోదరులు ఘనంగా 1501వా మిలాద్ ఉన్ నబి వేడుకలు నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ (ఈద్ఎమిలాద్) అనేది ఇస్లాం మత స్థాపకుడైన మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుక. అరబిక్ భాషలో 'మిలాద్' అంటే జన్మదినం, 'నబీ' అంటే ప్రవక్త అని అర్థం. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మూడవ నెల అయిన 'రబీ అల్అవ్వల్' (Rabi' alawwal) లో ఈ పండుగ వస్తుంది.

**ప్రాముఖ్యత, జరుపుకునే విధానం**

మహమ్మద్ ప్రవక్త బోధించిన ప్రేమ, కరుణ, శాంతి ,దాతృత్వం, మానవత్వ, విలువలను ఈ రోజున గుర్తు చేసుకుంటారు. ప్రార్థనలు ఖురాన్ పఠనం మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ చదివి ప్రవక్త జీవితంపై ప్రసంగాలు (సీరత్) నిర్వహిస్తారు. పేదలకు అన్నదానం చేయడం, వస్త్రాలు పంచడం, సామాజిక సేవా కార్యక్రమాలు, దానధర్మాలు చేపడుతారు. మసీదులు ,ఇళ్లను విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. ఈ కార్యక్రమంలో గాంధారి మజీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ బాబు, ఉపాధ్యక్షులు ఇస్మాయిల్, అస్గర్ అలీ, క్యాషియర్ మొఇజ్, ఇంజనీర్ అహ్మద్ ,మాజీ కో ఆప్షన్ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ముస్తఫా, షేక్ గౌస్, జాకిర్ అలీ, షఫీ, మధర్, సయ్యద్ అహ్మెద్,మత గురువులు, మైనారిటీ నాయకులు, గ్రామ మైనారిటీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## బిసిల వాటా సాధించడమే బిపి మండల్ కు ఇచ్చే నిజమైన నివాళి

▶ **బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు**



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** దేశంలో సగానికి పైగా ఉన్న బీసీలకు సకల రంగాలలో వాటా దక్కినప్పుడే బీపీ మండల్ ఆశయం నెరవేరుతుందని తాటిపాముల వెంకట్రాములు అన్నారు. బిసి హక్కుల సాధన సమితి వరంగల్ మండల ప్రధాన కార్యదర్శి కార్యదర్శి చెలుకల రాజు, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన వరంగల్ హెడ్ పోస్టాఫీసు సెంటర్ లో జరిగిన బిపి మండల్ 108వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధానకార్యదర్శి చింతకింది కుమారస్వామితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న వెంకటరాములు మాట్లాడుతూ బిసి సామాజిక వర్గానికి చెందిన బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 1979జనవరి 1న ఏర్పాటు చేసిన రెండవ బిసి కమీషన్ కు ఛైర్మన్ వ్యవహరించి 1980డిసెంబర్ 31న తన నివేదికను ప్రభుత్వానికి అందించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నివేదికను పట్టించుకోకున్నా, అప్పటి వరకు కేవలం 5శాతం మాత్రమే బిసిలకు రిజర్వేషన్లు అందుతుండగా 1990లో విపి సింగ్ ప్రభుత్వం అగ్రకులాల ఆందోళనల మధ్య మండల్ కమిషన్ సిఫారసుల ఆధారంగా 27శాతం రిజర్వేషన్లు ఖరారు చేశారన్నారు. ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత1992 నుంచి మాత్రమే రిజర్వేషన్లు అమలు అవుతున్నాయన్నారు. మండల్ కమీషన్ సిఫారసులను అమలు చేసినందుకు నాటి అగ్రకుల బిజెపి, కాంగ్రెస్ పార్టీలు విపి సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టాయన్నారు. నేటికీ ప్రభుత్వ రంగాలను ప్రైవేటుపరం చేస్తూ, ఉద్యోగాలు రిజర్వేషన్లు దక్కకుండా అగ్రకుల పార్టీలు కుట్రలు చేస్తున్నారన్నారు. బిజెపి పార్టీ లోపాయికారీగా మద్దతు ఇస్తూ అనిల్ మిశ్రా మొదలు పెట్టిన యాంటీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని తెరపైకి తెస్తుందన్నారు. ఇప్పటికైనా అన్ని అగ్రకుల పార్టీల వెనుక ఉన్న బీసీలంతా ఏకమై అన్ని రంగాల్లో బిసిల వాటా సాధించడానికి బిసి హక్కుల సాధన సమితి నిర్మించే బలమైన ఉద్యమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో శైలజ సరళాదేవి స్వరూప రాంబాయి లింగమ్మ భాస్కర్ రమేష్ శకుంతల తదితరులు పాల్గొన్నారు.

## మండల్ ఆశయ సాధనకు మరో ఉద్యమానికి సిద్ధం అవుదాం



▶ **ఎస్.డి.ఎఫ్ చైర్మన్ పోచబోయిన శ్రీహరి యాదవ్ పిలుపు**

**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** బీపీ మండల్ (బిందేశ్వరి ప్రసాద్ మండల్)108 వ జయంతిని సిద్దిపేట జిల్లా కేంద్రంలో బి జె ఆర్ చౌరస్తాలో వివిధ బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజాస్వామ్య శక్తుల బీసీ కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నిర్వాహకుడిగా ఉన్న సామాజిక ప్రజాస్వామ్య శక్తుల సమాఖ్య చైర్మన్ శ్రీ పోచబోయిన శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ మండల్ ఆశయాల సాధన కోసం సిద్దిపేటలోని బుద్ధి జీవులంతా దశాబ్దకాలంగా ఘనంగా వారి జయంతిని, వర్ధంతిని, మండల్ డేని నిర్వహిస్తున్నామని నేటి ప్రస్తుత రాజకీయ నేపథ్యంలో సామాజిక న్యాయం వ్యతిరేక శక్తులు ప్రేరేపిత ఆందోళన ద్వారా రిజర్వేషన్లను అడ్డుకో చూస్తున్నారని, రిజర్వేషన్ల హటావో పేరుతో కృత్రిమ ఉద్యమాలు నిర్మిస్తూ దేశంలో అశాంతిని అలజడులను రేపాలని చూస్తున్నారని ఈ సందర్భంగా నిజమైన దేశభక్తులమైన మనము ఈ భూమిపైన సంపదపైన, వనరులపైన, కొన్ని కులాలకి ఆధిపత్య వర్గాలకి మాత్రమే దక్కాలని చూస్తున్న స్వార్థపర శక్తులకు వ్యతిరేకంగా దేశభక్తియుత యువత అన్ని రంగాలలో జనాభా నిష్పత్తి ప్రకారం శ్రామిక ఉత్పత్తి కులాలకు వాటా దక్కే వరకు పోరాటానికి సిద్ధం కావాలని సామాజిక వ్యతిరేకంగా శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. జేఏసీ నేతలు ప్రభాకర్ వర్మ మామిళ్ల ఐలయ్య బోయ రాములు పయ్యావుల రాములు మాట్లాడుతూ బీపీ మండల్ 1918 ఆగస్ట్ 25న బీహార్‌లోని మాధేపురా సమీపంలోని ముర్హో గ్రామంలో జన్మించారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా సేవలందించారు. మండల్ కమిషన్ దేశంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులను (ఓబీసీ) గుర్తించడానికి 1979లో ఏర్పాటైన రెండవ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు ఆయన అధ్యక్షతవహించారు. సిఫారసులు. 3743 వెనుకబడిన తరగతులని ఓబీసీలుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కమిషన్ చారిత్రాత్మక సిఫారసు చేసింది అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కరసు ప్రభాకర్ వర్మ, మామిండ్ల ఐలయ్య యాదవ్, దరిపల్లి శ్రీనివాస్, కాముని నగేష్, పయ్యావుల రాములు యాదవ్, సందెబోయిన నాగరాజు, వల్లాల సంతోష్ గౌడ్, పడిగె ప్రశాంత్ ముదిరాజ్, గంధం రాజు యాదవ్, పయ్యావుల మల్లేశం, తరిగొప్పుల రామచంద్రం, మామిండ్ల రాము, వనామ రమేష్, వ్యాసబట్టు దయానంద రాజు, సింగబట్టు రామరాజు, తాళ్లపల్లి రాజు గౌడ్, వనమ అశోక్, మాచవరం మహేందర్, నెమలి సుభాష్, తెల్జేరు శ్రీనివాస్, వనం రమేష్, అశోక్, రాజాగౌడ్, ప్రశాంత్, సంతోష్, ప్రభురాజ్ గంగపుత్ర, తలారి ప్రవీణ్, తదితర కుల సంఘాల ప్రజాసంఘాల నాయకులు పాల్గొని వారికి పుష్పాంజలి ఘటించి వారి ఆశయ సాధనకు పునరంకితం అవుతామని నినదించారు. బహుజన గళం భీమసేన సామాజిక గీతాలు అందరికి స్ఫూర్తినిచ్చాయి.

## రేవంత్ కి ఆమెరికా పై ఉన్న ద్యాస అన్నదాతల మీద లేదా



▶ **సాగు నీళ్ల కోసం అరిగోస పడుతున్న అన్నదాతల ఆవేదన కనపడం లేదా : వేలేటి రాధాకృష్ణ శర్మ**

**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మ విమర్శించారు. రైతుల సమస్యలపై దృష్టి పెట్టకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, కాముని శ్రీనివాస్, శ్రీహరి యాదవ్, సోమిరెడ్డి రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో రాధాకృష్ణ శర్మ మాట్లాడారు. గత కొన్నేళ్లుగా రిజర్వాయర్లతో పచ్చగా ఉన్న సిద్దిపేట ప్రాంతంలో ప్రస్తుతం సాగునీటి సమస్యలు తలెత్తాయని అన్నారు. రైతులు పాదయాత్రలు చేసి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించడం లేదని ఆరోపించారు. రాజకీయాలను పక్కనపెట్టి రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎల్లంపల్లిలో సుమారు 27 టీఎంసీలు, మిడ్ మానేరులో సుమారు 20 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ నీటిని పంపింగ్ చేయడం లేదని రాధాకృష్ణ శర్మ పేర్కొన్నారు. ఇప్పటికైనా నీటిని ఎత్తిపోస్తే అనంతగిరి, రంగనాయక సాగర్‌తో పాటు మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లకు నీటిని తరలించే అవకాశం ఉందని తెలిపారు. వరుసగా ఆరు సంవత్సరాలు అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లు నీటితో నిండాయని, ఈసారి ఎందుకు నింపడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగం లేదనే అభిప్రాయాన్ని ప్రజల్లో కలిగించేందుకే ప్రభుత్వం నీటి ఎత్తిపోతలపై నిర్లక్ష్యం చేస్తోందా అని ప్రశ్నించారు. రిజర్వాయర్లపై నమ్మకంతో వేలాది మంది రైతులు పంటలు సాగు చేశారని, ఇప్పుడు నీటిని విడుదల చేయకపోతే పెట్టుబడులు నష్టపోయి రైతులు అప్పుల పాలయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు తక్షణమే సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు ఇప్పటికే ప్రభుత్వానికి లేఖలు రాశారని, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కూడా రైతుల సమస్యలను వివరించారని తెలిపారు. రైతులు పాదయాత్ర చేసి నిరసన తెలిపినా ప్రభుత్వం నుంచి తగిన స్పందన రాలేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలకు ఎన్‌డీఎస్ఏ అఫిడవిట్, సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదికలు సమాధానంగా నిలుస్తున్నాయని రాధాకృష్ణ శర్మ పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి కాళేశ్వరం నుంచి నీటిని లిఫ్ట్ చేసుకునే అవకాశం ఉందని ఎన్‌డీఎస్ఏ అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. అన్నారం, సుందిళ్లలో నిర్మాణపరమైన పరిస్థితులపై సీడబ్ల్యూపీఆర్ఎస్ పరిశీలనను కూడా ఆయన ప్రస్తావించారు. రాజకీయ కారణాలతో కాళేశ్వరం ప్రాజెక్టును పక్కన పెట్టి గోదావరి నీటిని వినియోగించకుండా దిగువకు వదిలేస్తున్నారని ఆరోపించారు. అన్నారం, సుందిళ్ల వద్ద మోటార్లు ఆన్ చేసి గోదావరి నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. నీటి పంపింగ్‌పై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. అవసరమైతే మిడ్ మానేరు వద్దకు వెళ్లి మోటార్లు ఆన్ చేసే స్థాయిలో పోరాటం చేస్తామని రాధాకృష్ణ శర్మ తెలిపారు. సీనియర్ నాయకుడు ఎల్లారెడ్డి మాట్లాడుతూ రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం వారి సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రైతులు, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొంటూ ప్రస్తుతం ప్రభుత్వం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్లు కనకరాజు, వెంకట్ రెడ్డి, కొండం రవీందర్ రెడ్డి, కాల్వ ఎల్లయ్య, ఉమేష్, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వనమహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమం కాదు

- **ప్రకృతిని కాపాడే బాధ్యత: పోచారం శ్రీనివాస్‌రెడ్డి**
- **పచ్చదనం పెరిగితేనే పర్యావరణ సమతుల్యత**
- **ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలి**
- **అటవీ ప్రాంతాల్లో పండ్ల చెట్లు పెంచితే కోతుల బెడద తగ్గే అవకాశం**




**చట్టం న్యూస్ – మోస్రా :** నిజామాబాద్ జిల్లా మోస్రా మండల పరిధిలోని గోవూర్ గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ వనమహోత్సవం అంటే మొక్కుబడిగా ఒక మొక్క నాటి వెళ్లిపోవడం కాదని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి చెట్టుగా పెంచడమే అసలైన లక్ష్యమని పేర్కొన్నారు. పచ్చదనం పెరిగితేనే పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుందని, ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు.

**రోజంతా మొక్కలు నాటే కార్యక్రమాల్లో పోచారం**

బాన్సువాడ నియోజకవర్గంలో ఉదయం నుంచి వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు పోచారం తెలిపారు. ముందుగా ఒక చెరువును శుభ్రం చేయించి, చెరువు కట్టపై ఈత మొక్కలు నాటినట్లు చెప్పారు. తర్వాత రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అటవీశాఖ ఆధ్వర్యంలో బోధన్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్ కార్యక్రమానికి హాజరై, అక్కడి నుంచి గోవూర్ గ్రామానికి చేరుకున్నట్లు వివరించారు.

**అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి**

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని పోచారం పేర్కొన్నారు. వనమహోత్సవం కొత్త కార్యక్రమం కాదని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన సామాజిక బాధ్యతలో భాగమని అన్నారు. "మొక్కను నాటి వదిలేయడం కాదు. దాన్ని సంరక్షించి చెట్టుగా పెంచాలి. అప్పుడే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుంది" అని తెలిపారు.

**పచ్చదనం ఉంటే పర్యావరణ పరిస్థితులు అనుకూలం**

వర్షపాతం, అడవులు, పచ్చదనం మధ్య సంబంధాన్ని పోచారం వివరించారు. బాన్సువాడ, మోస్రా, చందూర్, వర్ని మండలాల్లో మంచి వర్షపాతం నమోదవుతుండటానికి ఈ ప్రాంతాల్లో ఉన్న పచ్చదనం, అటవీ ప్రాంతాలు కూడా ఒక కారణమని అభిప్రాయపడ్డారు. తాను ప్రతిరోజూ వివిధ ప్రాంతాల వర్షపాతం వివరాలు తెలుసుకుంటానని చెప్పారు. మోస్రాలో 90 మిల్లీమీటర్ల వర్షం నమోదైన సమయంలో కోటగిరిలో 20 మిల్లీమీటర్లు, బాన్సువాడలో 88 మిల్లీమీటర్లు నమోదైన సమయంలో బీర్కూర్‌లో 30 మిల్లీమీటర్లు నమోదైన సందర్భాలను ఉదాహరణగా పేర్కొన్నారు. "ఎక్కడ పచ్చదనం ఉంటుందో అక్కడ పర్యావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. ప్రకృతి భగవంతుడు ఇచ్చిన వరం. ప్రకృతిని మనం శాసించలేం.. ప్రకృతే మనలను శాసిస్తుంది" అని అన్నారు.

**హరితహారం కార్యక్రమాన్ని గుర్తు చేసుకున్న పోచారం**

తాను వ్యవసాయ మంత్రిగా పనిచేసిన సమయంలో హరితహారం కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించిన విషయాన్ని పోచారం గుర్తు చేసుకున్నారు. అప్పటి కలెక్టర్ యోగితా రాణా, అటవీశాఖ అధికారులతో కలిసి మెదక్ జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో గ్రామాల వారీగా పర్యటించి ప్రజలను మొక్కలు నాటేలా ప్రోత్సహించినట్లు తెలిపారు. గత కొంతకాలంగా చేపడుతున్న పచ్చదనం పెంపు కార్యక్రమాలతో గ్రీనరీ శాతం మెరుగుపడిందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరింత పచ్చదనం పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

**ప్రతి ప్రాంతంలో మొక్కలు నాటే అవకాశం**

పొలం గట్లపై బండ్ ప్లాంటేషన్, గ్రామాల్లో ఖాళీ ప్రదేశాల్లో కమ్యూనిటీ ప్లాంటేషన్, ఇళ్ల ముందు హోమ్ ప్లాంటేషన్, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో మొక్కలు నాటడం, రోడ్ల వెంట అవెన్యూ ప్లాంటేషన్ వంటి పద్ధతుల ద్వారా పచ్చదనం పెంచవచ్చని పోచారం సూచించారు. అటవీ భూముల్లో ఖాళీగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తిరిగి పచ్చదనంతో నింపేందుకు అటవీశాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

**మొక్కలు నాటిన వారి పేర్లు చిరస్థాయిగా ఉంటాయి**

గ్రామాల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమాలను ముందుండి నిర్వహించాలని పోచారం సూచించారు. నాటిన మొక్కలు భవిష్యత్‌లో పెద్ద చెట్లుగా మారిన తర్వాత వాటిని ఎవరి హయాంలో నాటారనే విషయం ప్రజలకు గుర్తుండిపోతుందని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే పచ్చదనం కార్యక్రమాలు చేపట్టడం ప్రజాప్రతినిధులకు మంచి గుర్తింపును తీసుకొస్తుందని పేర్కొన్నారు.

**చెట్లు నాటడం మన బాధ్యత.. నరికివేయడం కాదు**

చెట్లు నాటడమే కాకుండా వాటిని రక్షించడం కూడా ప్రతి ఒక్కరి కర్తవ్యమని పోచారం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని గుర్తుచేశారు. అడవులను ఎలా కాపాడుకుంటామో గ్రామాలు, పట్టణాల్లోని చెట్లను కూడా అదే బాధ్యతతో సంరక్షించాలని సూచించారు.

**వాతావరణ మార్పులపై ఆందోళన**

ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని పోచారం పేర్కొన్నారు. హిమాలయ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు కరగడం వంటి పరిణామాలు ప్రకృతి విపత్తులకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. అడవుల నాశనం, పచ్చదనం తగ్గడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని చెప్పారు. భవిష్యత్ తరాల భద్రత కోసం ప్రకృతిని కాపాడుకోవడం అత్యవసరమని స్పష్టం చేశారు. నగరాలు, గ్రామాలు, పాఠశాలలు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పబ్లిక్ ఇన్‌స్టిట్యూషన్లలో పెద్దఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.

**పండ్ల చెట్లతో కోతుల బెడదకు పరిష్కారం**

మోస్రా పరిసర గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉందని పోచారం పేర్కొన్నారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పండ్ల చెట్లను ఎక్కువగా పెంచితే కోతులకు అడవుల్లోనే ఆహారం లభిస్తుందని తెలిపారు. దీంతో కోతులు గ్రామాల్లోకి వచ్చే పరిస్థితి కొంతవరకు తగ్గే అవకాశం ఉందన్నారు. రైతునగర్ ప్రాంతంలో సర్పంచ్ నాగేశ్వరరావు చేపట్టిన పండ్ల చెట్ల పెంపు కార్యక్రమాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు.

**రాజకీయాలకు అతీతంగా వనమహోత్సవం**

వనమహోత్సవాన్ని రాజకీయ కోణంలో కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలని పోచారం సూచించారు. పచ్చదనం పెంపులో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అటవీశాఖ సిబ్బంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గోవూర్ గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించిన అటవీశాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఎఫ్‌డీఓ సుధాకర్, ఎఫ్ఆర్ఓ పుండ్లిక్, బీట్ ఆఫీసర్ తిల్లీ హుస్సేన్, తహసీల్దార్ ధన్వాల్, ఎంపీడీఓ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా డీసీసీ కార్యదర్శి పిట్ల ఉమా శ్రీరాములు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొత్తిమీర్కార్ లక్ష్మణ్, ఎంఈఓ నాగనాథ్, గోవూర్ సర్పంచ్ కత్తి రవి, చింతకుంట తిమ్మాపూర్ సర్పంచులు వంగ నీలిమ సాయగౌడ్, తొంట పోశెట్టి, మాజీ జడ్పీటీసీ రంజా నాయక్, ఇతర ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో మొక్కలు నాటిన సర్పంచ్ కుంజా వినోద్

- **పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**
- **పచ్చని గ్రామాల నిర్మాణమే లక్ష్యం**



**చట్టం – అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం ములకలపల్లి మండలం జగన్నాధపురం గ్రామ పంచాయతీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ప్రాంగణంతో పాటు దమ్మపేట రేంజ్ తోగ్గూడెం రైతు వేదిక వద్ద గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సర్పంచ్ కుంజా వినోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కుంజా వినోద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, గ్రామంలోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మొక్కను నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు విస్తృతంగా మొక్కలు నాటడం ఎంతో అవసరమని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. పచ్చని గ్రామాల నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, భవిష్యత్ తరాలకు పచ్చని ప్రపంచాన్ని అందించేందుకు మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జలగం మాధవి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ జోగా భదయ్య, బీట్ ఆఫీసర్ రమేష్, నరేష్, పాఠశాల హెచ్ఎం తానం వసంత, ఏఈవో రమేష్, సెక్రటరీ సునీష్, బీఎల్ఏ కోఆర్డినేటర్ సురభి రాజేష్, ములకలపల్లి మండల కాంగ్రెస్ నాయకులు చేకుర్తి రామాచారి, మిడియం నారాయణ, సున్నం నాగేష్, ఫారెస్ట్ అధికారులు, వార్డు సభ్యురాలు సున్నం మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లక్కీ డ్రాతో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు

- **అర్హులైన నిరుపేదలకు పారదర్శకంగా ఇళ్ల పంపిణీ**
- **అవకతవకలకు తావులేకుండా లబ్ధిదారుల ఎంపిక**



**చట్టం రామకృష్ణాపూర్: (మందమర్రి):** అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పారదర్శకంగా కేటాయించేందుకు లక్కీడ్రా నిర్వహించిన్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మందమర్రి మండల కేంద్రంలోని ఆర్.కె. గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారుల లక్కీ డ్రా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. డీసీపీ ఎ.భాస్కర్, మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగు, తహసీల్దార్ సతీష్‌కుమార్, ఇందిరమ్మ ఇళ్ల పీడీ బన్సీలాల్‌తో కలిసి లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఇళ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హత కలిగిన లబ్ధిదారులను లక్కీ డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన నిరుపేదలకు సొంత గూడు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇళ్ల పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ అంజన్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సారంపెల్లి మల్లారెడ్డి మృతి రైతాంగ ఉద్యమానికి తీరని లోటు: వెంకట్రాములు



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, అఖిల భారత రైతు సంఘం ఉపాధ్యక్షుడు కామ్రేడ్ సారంపెల్లి మల్లారెడ్డి మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పేర్కొన్నారు. మల్లారెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన వెంకట్రాములు, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మల్లారెడ్డి చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. సాగునీటి ప్రాజెక్టుల సాధన, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, రైతుల రుణమాఫీ, రైతు సంక్షేమం కోసం జరిగిన అనేక ఉద్యమాలకు మల్లారెడ్డి ప్రత్యక్షంగా నాయకత్వం వహించారని గుర్తుచేశారు. రైతులు, వ్యవసాయ కూలీల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడిగా ఆయన ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, రైతులు, వ్యవసాయ కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో మల్లారెడ్డి మృతి రైతాంగ, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. మల్లారెడ్డి ఆశయాల సాధన కోసం అంకితభావంతో కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని వెంకట్రాములు పేర్కొన్నారు.

## పచ్చదనమే భావితరాలకు భరోసా

- **41 లక్షల మొక్కల లక్ష్యంలో 80 శాతం పూర్తి**
- **ఒక్కరోజే జిల్లాలో 4 లక్షల మొక్కలు నాటిన అధికారులు**



**చట్టం రామకృష్ణాపూర్:** భావితరాలకు ఆరోగ్యకరమైన, సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో మంగళవారం ఒక్కరోజే 4 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి వనంలో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెట్లతో స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన ఆహారం, ఆశ్రయం లభించడంతో పాటు సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జిల్లాకు నిర్దేశించిన 41 లక్షల మొక్కల లక్ష్యంలో ఇప్పటికే దాదాపు 80 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య యాత్ర – మన ఎమ్మెల్యే, మన బడి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ




**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం మల్లారం గ్రామంలో 'నేను సైతం చేయూత' కార్యక్రమంలో భాగంగా 'విద్య యాత్ర - మన ఎమ్మెల్యే, మన బడి' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారం గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే విద్యార్థుల అభ్యసన విధానం, విద్యా నైపుణ్యాలు, బోధన ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు తీరు, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాల పరిసరాలు, భవన పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు అత్యవసర భవన మరమ్మతుల కోసం ప్రత్యేక గ్రాంట్ కేటాయించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సేవా గుణానికి,దాతృత్వానికి ప్రతి రూపం మదర్ థెరిస్సా

- **ఆమె సేవ గుణానికి చిహ్నం**



మాసిడోనియాలో 1910 ఆగస్టు 26న మదర్ థెరిస్సా జన్మించారు. ఎక్కడో పుట్టి సేవ చేయాలనే సంకల్పంతో భారత్‌కు వచ్చారు. కలకత్తాలో కుష్టు రోగులకు సేవ చేశారు. ఆమె జీవితం ప్రతి అమ్మకు ఆదర్శం. సేవకు మారుపేరుగా నిలిచిన థెరిస్సా మానవ సేవ కన్నా మిన్న లేదని చాటిన మహిళామణి మదర్ థెరిస్సా. ఈ దేశంలో పుట్టకపోయినా, ఈ దేశంలోని ఆపన్నులు, ఆర్తులు, ఆపదలో ఉన్నవారిని ఆదుకొనుటలో ఆమెను మించిన వారు లేరు. ప్రపంచంలోని గొప్ప మహిళామణులలో ఎవరు అంటే ఆమె పేరు పేర్కొనకుండా వేరొకరి పేరు చెప్పటానికి కుదరదు. అందుకే ఆమె ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన వనిత అనటంలో ఏమాత్రం అతిశయోక్తి ఉండదు. అలాంటి అమ్మ జయంతి నేడు.1910 ఆగష్టు 26న అల్బేనియా దేశంలోని (ఇప్పుడు స్కోప్జే, మాసిడోనియా) యొక్క ముఖ్య పట్టణంలో జన్మించారు. 1929 జనవరి 6వ తేదిన భారతదేశంలోని కలకత్తా నగరం చేరుకున్నది. అప్పటినుండి విద్యాబోధన చేస్తూ... 1947లో పేదరికాన్ని స్వీకరిస్తున్నట్లు ప్రమాణం చేసింది. 'శాంతినగర్' అనే పేరుతో అసన్‌సోల్ నగరంలో ఒక కాలనీ కట్టుకునేటట్లు కుష్టు రోగం గలవారిని ప్రోత్సహించింది. 1952 లో మదర్ థెరీసా కలకత్తా నగరంలో మొదటి హోమ్ ఫర్ ది డయింగ్ ను ప్రారంభించారు. భారతదేశ అధికారుల సహాయంతో ఆమె ఒక పాడుబడిన హిందూ దేవాలయాన్ని పేద ప్రజల ధర్మశాలగా మార్చారు. ఆమె దానికి కాళీఘాట్ పరిశుద్ధ హృదయ నిలయం (కాళీఘాట్ హోం ఫర్ ది డయింగ్) (నిర్మల్ హృదయ్) గా పేరు పెట్టారు స్త్రీ ధార్మిక సమాఖ్య, మిషనరీస్ ఆఫ్ చారిటీ అనే ధార్మిక సంస్థను నెలకొల్పింది. పద్మశ్రీ, భారతరత్న లాంటి అత్యున్నత పురస్కారాలు మదర్ థెరిస్సాకు అందించారు. ఆమె చేసిన సేవలు శాంతి బోధనకు ప్రపంచ అత్యున్నత పురస్కారం నోబెల్ శాంతి బహుమతి ఆమెను వరించింది. సేవా గుణంలో ఆమెని స్పూర్తిగా తీసుకుని సమాజ సేవ చేద్దాం.


**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా**
**9848445134**


## చెట్లను నాటుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- **ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ యాదవ్**




**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అత్యంత అవసరమని ఏఎంసీ చైర్మన్ మీసం మహేందర్ అన్నారు. మంగళవారం వనమహోత్సవంలో భాగంగా చిన్నకోడూరు, అల్లీపూర్, పెద్దకోడూరు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలన్నారు. మొక్కలను మనం సంరక్షిస్తే అవి వృక్షాలుగా మారి మనల్ని రక్షిస్తాయన్నారు. మొక్కలు నాటడమే కాకుండా సంరక్షించే బాధ్యత కూడా ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జనార్దన్, ఎంపీఓ శ్రీనివాస్ రావ్,ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కుంభాల మణెమ్మ, ఉప సర్పంచ్ కొలనుపాక శ్రీనివాసరెడ్డి, కన్నా రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పాకాల భూపతి రెడ్డి, ఎండి సలీం, డిసిసి ప్రధాన కార్యదర్శి సంద బోయిన పరశురాం, పొన్నాల రాజేష్, ఎస్సీ డిపార్ట్మెంట్ మాజీ అధ్యక్షులు కొమ్ము ప్రశాంత్, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు అనంతగిరి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని గణేష్, సీనియర్ నాయకులు కొరిమిరాజు, మహేందర్ రెడ్డి, కాల్వ జగన్, బర్ల స్వామి, హరిబాబు, గొట్టిపర్తి చందు, కనుకయ్య ,అధికారులు, ఎంపీడీవో జనార్ధన్, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ లో ఘోరం

- **మహిళ మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడు లాకెళ్లిన దుండగులు**



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో మంగళవారం రాత్రి దారుణం జరిగింది. నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలోంచి గుర్తుతెలియని ఇద్దరు దుండగులు బంగారు గొలుసును తెంపుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. నందిపేట మండలం కుదావన్ పూర్ గ్రామానికి చెందిన శిల్ప, అనే మహిళ పాత బస్టాండ్ నుండి కొత్త బస్టాండ్ వైపు నడుచుకుంటూ వెళ్తోంది. రాత్రి 7:30 గంటల సమయంలో ఆమె అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకోగానే, మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఒక్కసారిగా ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని మెరుపువేగంతో పారిపోయారు. బాధిత మహిళ కేకలు వేసేలోపే దుండగులు మామిడిపల్లి చౌరస్తా వైపు బైక్‌పై పరారయ్యారు. సమాచారం అందుకున్న ఆర్మూర్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను (ఐడీ పార్టీ) రంగంలోకి దించి, గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఆర్మూర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

## డిజిటల్ వెలుగుల్లో... సర్కార్ బడుల కళ

- **ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో డిజిటల్ బోధనతో మారుతున్న విద్యా రూపురేఖలు**
- **ఆసక్తికరంగా మారుతున్న పాఠాలు... విద్యార్థుల్లో పెరుగుతున్న సృజనాత్మకత**



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** బ్లాక్‌బోర్డు, సుద్దముక్క కాలం చెల్లుతోంది... ఇప్పుడు సర్కార్ జూనియర్ కళాశాలల్లోనూ సాంకేతికత ఘుమఘుమలాడుతోంది! ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఆధునిక హంగులతో సరికొత్త విద్యా వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ టీవీలు, డిజిటల్ బోర్డులు నేడు తరగతి గదుల రూపురేఖలనే పూర్తిగా మార్చేస్తున్నాయి.

**ప్రతి కళాశాలలోనూ సాంకేతిక సౌలభ్యం**

ప్రభుత్వం ప్రతి కళాశాలలో ఆరు చొప్పున డిజిటల్ బోర్డులను అందుబాటులోకి తీసుకురావడంతో లెక్చరర్ల బోధన శైలిలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి కెమిస్ట్రీ, ఫిజిక్స్, బాటనీ, జువాలజీ, మ్యాథ్స్ వంటి సైన్స్ సబ్జెక్టులతో పాటు ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్, హిందీ, తెలుగు తదితర అన్ని సబ్జెక్టుల సిలబస్‌లో వచ్చిన మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు ఈ డిజిటల్ వనరులను సమర్థంగా వినియోగిస్తున్నారు.

**కళ్లకు కట్టినట్టుగా సాహిత్య పాఠాలు...**

ముఖ్యంగా తెలుగు సాహిత్య బోధనలో ఈ డిజిటల్ విప్లవం స్పష్టంగా కనిపిస్తోంది. పద్యాలు, గద్య పాఠాలు, ఆధునిక సాహిత్య ధోరణులను బోధించేటప్పుడు కేవలం పుస్తక పరిమితం కాకుండా... ఆయా కవులు, రచయితల చిత్రాలు, చారిత్రక నేపథ్యం, సంఘటనలను డిజిటల్ తెరలపై ప్రదర్శిస్తున్నారు. దృశ్య రూపకాలు, ఛాయాచిత్రాల సాయంతో పాఠాలను వివరిస్తుండటంతో విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాఠాలు వింటున్నారు. క్లిష్టమైన పద్య భావాలు సైతం ఇట్టే అర్థమవుతున్నాయని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**మెరుగవుతున్న అభ్యసన సామర్థ్యాలు**

* సృజనాత్మకతకు పెద్దపీట: డిజిటల్ బోధన ద్వారా విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంతో పాటు పరిశీలనా శక్తి, సృజనాత్మక ఆలోచనలు ఇనుమడిస్తున్నాయి.

* చురుకైన భాగస్వామ్యం: సరికొత్త కోణంలో పాఠాలు సాగుతుండటంతో తరగతి గదుల్లో విద్యార్థులు మరింత చురుగ్గా పాల్గొంటున్నారు.

* లెక్చరర్ల హర్షం: సంప్రదాయ బోధనా విధానానికి సాంకేతికతను జోడించడం ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు గణనీయంగా మెరుగవుతున్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు పేర్కొంటున్నారు.

**భవిష్యత్తుకు బలమైన పునాది**

ప్రభుత్వ కళాశాలల్లో డిజిటల్ బోర్డుల ఏర్పాటు విద్యార్థులకు ఆధునిక విద్యా వాతావరణాన్ని అందించడంలో ఒక మైలురాయిగా నిలిచిందని తెలుగు లెక్చరర్ ఎన్. లక్ష్మణ్, కెమిస్ట్రీ లెక్చరర్ జెట్టి విజయకుమార్ అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో ఈ డిజిటల్ వనరులను మరింత విస్తృతంగా వినియోగిస్తే... విద్యార్థుల్లో పోటీ పరీక్షలకు అవసరమైన విశ్లేషణాత్మక దృక్పథం, సమగ్ర జ్ఞానం మరింత పెరుగుతాయని వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## 15 వేల కుటుంబాలకు పూల, పండ్ల మొక్కల పంపిణీకి సిద్ధం



ఐదో వార్డులో 500 మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో పట్టణంలో పచ్చదనానికి ప్రత్యేక ప్రణాళికలు చట్టం న్యూస్, వేములవాడ రూరల్ : వేములవాడ పట్టణంలోని సుమారు 15 వేల కుటుంబాలకు త్వరలో ఒక్కో పూల మొక్కతో పాటు ఒక్కో పండ్ల మొక్కను పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని నాంపల్లి ఐదో వార్డు పరిధిలోని ఇస్లాం నగర్‌లో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇస్లాం నగర్‌లో సుమారు 500 మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని, పచ్చదనం పెరిగితేనే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నిరంతర సహకారంతో వేములవాడ పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు పలు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి ఇల్లు పచ్చదనంతో శోభిల్లాలనే ఉద్దేశంతో సుమారు 15 వేల కుటుంబాలకు పూల, పండ్ల మొక్కలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. కేవలం మొక్కలు నాటడంతో బాధ్యత పూర్తికాదని, వాటిని సంరక్షించి మహావృక్షాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ వేములవాడను కాలుష్య రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు వన మహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ లోకేష్, పట్టణ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

## శ్రీ గౌరీ దేవి సామూహిక కుంకుమార్చన అంగరంగ వైభవంగా నిర్వహణ



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేటలోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర దేవాలయంలో శ్రావణ మంగళవారం పురస్కరించుకొని శ్రీ గౌరీ దేవి సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సౌభాగ్యం, అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. దేవాలయ అర్చకుడు రంజిత్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి.కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లను నీలకంఠ సమాజ మహిళా విభాగం చేపట్టింది. పూజా సామాగ్రిని నీలకంఠ సమాజం సమకూర్చగా, భక్తులకు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సమాజ గౌరవ అధ్యక్షుడు కడవేర్గు నర్సింలు, సమాజ అధ్యక్షుడు గుండ్ల యోగేశ్వర్, అఖిల భారత అధ్యక్షుడు లోక లక్ష్మీరాజం, సలహాదారు కడవేర్గు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుండ్ల జనార్దన్, ప్రధాన కార్యదర్శి అబ్బతిని సురేష్, కార్యదర్శి కడవేర్గు రాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు కడవేర్గు భారతి, ప్రధాన కార్యదర్శి కళావతి, బోద భూంయ్య, నర్సింలు, శ్రీనివాస్, స్వప్న, కాల్వ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## GO 97 రద్దు డిమాండ్‌తో పాలిటెక్నిక్ కళాశాలల బంద్ విజయవంతం : ఏబీవీపీ

- **పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి: ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు సావుల ఆదిత్య**



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** GO 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) పిలుపు మేరకు చేపట్టిన రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌లో భాగంగా చేర్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులు నిరసన చేపట్టారు. తరగతులను బహిష్కరించిన విద్యార్థులు కళాశాల ముందు GO 97 ప్రతులను దహనం చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు సావుల ఆదిత్య మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్య పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మార్గం చూపే కీలక విద్యా వ్యవస్థ అని పేర్కొన్నారు. GO 97 అమలుతో పాలిటెక్నిక్ విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఉన్నత విద్య అవకాశాలు, ఉద్యోగ అవకాశాలు, సాంకేతిక విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యారంగ నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కీలక నిర్ణయాలు అమలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇప్పటికే అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయాల సమస్యలు, ప్రయోగశాలల కొరత, ఆధునిక సాంకేతిక పరికరాల లేమి వంటి సమస్యలు ఉన్నాయని ఆదిత్య పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులపై అదనపు భారం పడే విధానాలు అమలు చేస్తే వారి భవిష్యత్తు మరింత అనిశ్చితిలో పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం GO 97ను వెంటనే రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసే సమగ్ర విధానాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలతో విస్తృత చర్చలు జరిపిన తర్వాతే తదుపరి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల విద్య, ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలకు పూర్తి భరోసా కల్పించాలని ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఇన్‌చార్జ్ సాయి, మేఘన, రమేష్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వనమహోత్సవానికి ఆహ్వానించలేదంటూ ఎంపీడీవోకు ఉపసర్పంచ్ ఫిర్యాదు



**చట్టం – శంకరపట్నం :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమానికి తనను సరైన సమయంలో ఆహ్వానించకుండా అవమానపరిచారంటూ కరీంపేట గ్రామ ఉపసర్పంచ్ చింతం రాజేశం మంగళవారం ఎంపీడీవో అనితకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చింతం రాజేశం మాట్లాడుతూ, మంగళవారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం ముగిసే సమయానికి, ఉదయం 11 గంటల సమయంలో పంచాయతీ కార్యదర్శి తనకు సమాచారం అందించారని తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని కనీసం ఒక రోజు ముందుగా తెలియజేయాల్సి ఉండగా, చివరి నిమిషంలో సమాచారం ఇవ్వడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను కార్యక్రమానికి హాజరుకాకూడదనే ఉద్దేశంతో ఆలస్యంగా సమాచారం ఇచ్చారా, లేక ప్రజాప్రతినిధిగా ఉన్న తనను అవమానించాలనే ఉద్దేశంతో ఇలా వ్యవహరించారా అని ప్రశ్నించారు. గ్రామంలో బాధ్యతాయుతమైన ఉపసర్పంచ్ పదవిలో ఉన్న తనకు సమయానికి సమాచారం ఇవ్వకపోవడంపై శాఖాపరమైన విచారణ జరిపించాలని కోరారు. ఘటనపై విచారణ చేపట్టి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో అనితకు చింతం రాజేశం విజ్ఞప్తి చేశారు.

## జీవో నెంబర్ 97పై హయ్యర్ కమిటీ కాలయాపన చేయొద్దు

- **విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు: ఎస్ఎఫ్ఐ హెచ్చరిక**




**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన జీవో నెంబర్ 97పై రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ లెవెల్ హయ్యర్ కమిటీని ఏర్పాటు చేయడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) స్వాగతిస్తున్నప్పటికీ, కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా విద్యార్థుల సమస్యలను నిష్పక్షపాతంగా పరిశీలించి స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 97 ద్వారా పాలిటెక్నిక్ విద్యను ఐటీఐ, ఏటీసీ తరహా విధానాలతో అనుసంధానం చేయడం వల్ల విద్యార్థుల సాంకేతిక విద్య, ఉన్నత విద్య అవకాశాలు, భవిష్యత్తు విద్యా మార్గాలపై అనేక సందేహాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పాలిటెక్నిక్ విద్య అందించాల్సిన ప్రభుత్వం విద్యను కేవలం నైపుణ్యాలకే పరిమితం చేసే విధానాల వైపు తీసుకెళ్లడం సరైన నిర్ణయం కాదని తెలిపారు. ఇప్పటికే విద్యార్థులు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో అనేక ఆందోళనలు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కమిటీ ఏర్పాటు పేరుతో విషయాన్ని వాయిదా వేయడం సమంజసం కాదన్నారు. జీవో నెంబర్ 97పై ఏర్పాటు చేసిన స్టేట్ లెవెల్ హయ్యర్ కమిటీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వాస్తవ పరిస్థితులను పరిశీలించి, వీలైనంత త్వరగా స్పష్టమైన నివేదిక సమర్పించాలని డిమాండ్ చేశారు. కమిటీ నివేదిక పేరుతో నెలల తరబడి సమస్యను నాన్చే ప్రయత్నం చేయొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగే విధంగా నిర్ణయాలు తీసుకుంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని జీవో నెంబర్ 97పై విద్యార్థులకు అనుకూలమైన నిర్ణయం తీసుకోవడంతో పాటు పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రణయ్, పండు, ఇతర నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమం



**చట్టం – నసురుల్లాబాద్ :** కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపీడీవోతో పాటు వివిధ శాఖల అధికారులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామాల్లో విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని అధికారులు సూచించారు. మొక్కల పెంపకం ద్వారా పచ్చదనం పెరగడంతో పాటు ప్రకృతి, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, ఎంఈవో చందర్ నాయక్, డాక్టర్ సౌజన్య, ఆర్ఐ వెంకటరమణ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు గునిగేరి హనుమాన్లు, ఏపీవో సౌజన్య, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ కాల్లూరి సాయిలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కామారెడ్డి నియోజకవర్గంలో నలుగురు పీఏసీఎస్ చైర్మన్ల నియామకం

- **ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసి కృతజ్ఞతలు తెలిపిన నూతన ఛైర్మన్లు**



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు (పీఏసీఎస్) నూతన ఛైర్మన్ల నియామకం జరిగింది. బిక్కనూర్ మండలం రామేశ్వర్‌పల్లి పీఏసీఎస్ ఛైర్మన్‌గా బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, అంతంపల్లి పీఏసీఎస్ ఛైర్మన్‌గా చిట్టేడి సుధాకర్ రెడ్డి, దోమకొండ పీఏసీఎస్ ఛైర్మన్‌గా అనంతరెడ్డి, మాచారెడ్డి పీఏసీఎస్ ఛైర్మన్‌గా నౌసిలాల్ నాయక్ నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన ఛైర్మన్లు మంగళవారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ నూతన ఛైర్మన్లకు శుభాకాంక్షలు తెలుపుతూ దిశానిర్దేశం చేశారు. రైతుల సంక్షేమం, సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలు, రుణాలు, ఎరువులు, విత్తనాలు రైతులకు పారదర్శకంగా అందేలా చూడాలని సూచించారు. పీఏసీఎస్‌లు కేవలం రుణాలు ఇచ్చే సంస్థలుగా కాకుండా రైతుల ఆర్థికాభివృద్ధికి కేంద్రాలుగా పనిచేయాలని, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామని నూతన ఛైర్మన్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, మండల అధ్యక్షులు పాత రాజు, నాగన్నగారి నరేందర్ రెడ్డి, కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆగస్టు 27న దేశవ్యాప్తంగా 'వికసిత్ భారత్ యువ కనెక్ట్ – స్పోర్ట్స్ ఎడిషన్'



- **1,600 ప్రాంతాల్లో 8 లక్షల మందికి పైగా యువతతో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ సంభాషణ**
- **యువతలో క్రీడా స్ఫూర్తి, దేశ నిర్మాణంలో భాగస్వామ్యం పెంపే లక్ష్యం**

**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 27న దేశవ్యాప్తంగా "వికసిత్ భారత్ యువ కనెక్ట్ - స్పోర్ట్స్ ఎడిషన్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి తెలిపారు. దిగ్గజ హాకీ క్రీడాకారుడు, జాతీయ ఐకాన్ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ ఏడాది జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా యువత భాగస్వామ్యం, క్రీడల అభివృద్ధి, దేశ నిర్మాణంపై ప్రత్యేక దృష్టితో ఆగస్టు 27న యువ కనెక్ట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. దేశంలోని యువత, క్రీడాకారులు, భవిష్యత్ తరాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. దేశంలోని ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన కళాశాలల్లో యువ కనెక్ట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సిద్దిపేట జిల్లాలో కేటగిరి-A కింద తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల, కేటగిరి-B కింద గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల ఎంపికయ్యాయని తెలిపారు. మెదక్ జిల్లాలో కేటగిరి-A కింద ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల, కేటగిరి-B కింద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సాపూర్ ఎంపికయ్యాయని వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో కేటగిరి-A కింద ఎంఎన్ఆర్ యూనివర్సిటీ, సంగారెడ్డి, అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పటాన్‌చెరు, కేటగిరి-B కింద ఎంఎన్ఆర్ ఫార్మసీ కళాశాల, సంగారెడ్డి ఎంపికైనట్లు రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా యువతకు క్రీడాకారులు, ఎంపీలు, కేంద్ర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో నేరుగా సంభాషించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాల్లో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత క్రీడా వ్యవస్థలో వచ్చిన మార్పులు, క్రీడాకారులకు అందుతున్న అవకాశాలు, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై యువతకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 27న దేశవ్యాప్తంగా 1,600 ప్రాంతాల్లో 8 లక్షలకు పైగా యువతను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. దేశంలోని వివిధ ప్రాంతాల యువతను ఒకే జాతీయ వేదిక ద్వారా అనుసంధానం చేయడం ఈ కార్యక్రమ ప్రత్యేకతగా పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే అతిథులు, యువతీ యువకులు ఉదయం 10 గంటలలోపు సంబంధిత వేదికలకు చేరుకోవాలని సూచించారు. ప్రధాని ప్రసంగం అనంతరం స్థానిక యువతతో పరస్పర చర్చలు, భాగస్వామ్య కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. మై భారత్ వాలంటీర్లు, స్థానిక క్రీడాకారుల మధ్య ప్రత్యేక పరస్పర చర్చ కార్యక్రమం నిర్వహించడంతో పాటు భారత క్రీడా మౌలిక సదుపాయాల్లో వచ్చిన మార్పులు, క్రీడాకారులకు లభిస్తున్న అవకాశాలు, దేశ క్రీడా వ్యవస్థ అభివృద్ధిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎంపీ లేదా కేంద్ర మంత్రి యువతను ఉద్దేశించి ప్రసంగించి వారితో ముఖాముఖి చర్చలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం సుమారు 15 నిమిషాల పాటు "యువ సంవాద్" కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. ఇందులో యువత భారత క్రీడా రంగం, వికసిత్ భారత్ భవిష్యత్తుపై తమ ఆలోచనలు, సూచనలు, ఆకాంక్షలను పంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంజిత్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సునీత, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి డా. సి.హెచ్. పుష్పలత, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం ఎందుకు అమలు చేయడం లేదు



- **బీఆర్ఎస్ విద్యార్థి నేతల ప్రశ్న**
- **పథకం అమలు చేయకుంటే పాఠశాలల వద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరిక**

**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** ఇతర జిల్లాల్లో అమలు చేస్తున్న సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని సిద్దిపేట జిల్లాలో ఎందుకు ప్రారంభించడం లేదని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిద్దిపేట విద్యార్థుల విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపిస్తూ, తక్షణమే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు శ్యాం యాదవ్, ఇరుగంటి రమేష్, మెరుగు మాధవ్, రాజశేఖర్ రెడ్డి, అప్పాల శేఖర్ తదితరులు మీడియాతో మాట్లాడారు. జిల్లాలో అవసరమైన వసతులు అందుబాటులో ఉన్నప్పటికీ సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించకపోవడం బాధాకరమని వారు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లాలో సుమారు లక్షా 50 వేల మంది విద్యార్థులు ఈ పథకం కోసం ఎదురుచూస్తున్నారని నేతలు తెలిపారు. ఇతర జిల్లాల్లో అమలవుతున్న పథకం సిద్దిపేటకు ఎందుకు వర్తించడం లేదో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. ఉదయం అల్పాహారం లేకుండా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే పరిస్థితి ఉండకూడదని అన్నారు. సిద్దిపేట జిల్లాపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆరోపించిన నేతలు, స్థానిక కాంగ్రెస్ నాయకులు కూడా ఈ అంశంపై స్పందించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. నెలల తరబడి బిల్లులు అందకపోతే మధ్యాహ్న భోజన నిర్వహణపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను పూర్తిస్థాయిలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని కూడా నేతలు ఆరోపించారు. కొన్ని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, పెచ్చులు ఊడిపడుతున్న చోట్ల విద్యార్థుల భద్రతపై ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరుతో కొత్త విద్యా సంస్థలను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టడంతో పాటు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలల సమస్యలను కూడా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి అవసరమని, విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని నేతలు అభిప్రాయపడ్డారు. సిద్దిపేట జిల్లాలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని తక్షణమే అమలు చేయకపోతే విద్యార్థులకు మద్దతుగా ప్రతి పాఠశాల ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని బీఆర్ఎస్ విద్యార్థి నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిట్ల రాకేష్, శ్రీకాంత్ రెడ్డి, బత్తుల ఆకాష్, బాను చందర్, మహేష్ గౌడ్, నాగరాజు, ఇమ్రాన్, సోహెల్, చింటూ, ప్రశాంత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీల ఎన్నిక



**చట్టం – శంకరపట్నం :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శంకరపట్నం మండల కేంద్రంలోని లక్ష్మీ ప్రసన్న గార్డెన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల ఇన్‌చార్జి దేవునూరి రవీందర్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇంజం వెంకటస్వామి మాదిగ, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, జాతీయ నాయకుడు రుద్రారపు రాంచెంద్రం మాదిగ, మాజీ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఉద్యమ చరిత్ర, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంక్షేమ పథకాల సాధన కోసం నిర్వహించిన పోరాటాలను వివరించారు. మహనీయుల ఆశయ సాధనకు, పీడిత వర్గాల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ శక్తిగా నిలవాలని పిలుపునిచ్చారు. వర్గీకరణ పోరుబాటలో అమరులైన వారికి మౌనం పాటించి నివాళులర్పించారు. సెప్టెంబర్ 9న వరంగల్‌లో జరగనున్న జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. అనంతరం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ:**
మండల అధ్యక్షుడిగా కోడూరి మహేష్, అధికార ప్రతినిధిగా ఏమునూరి నాగరాజు, ప్రధాన కార్యదర్శులుగా చల్లూరి సతీష్, ఆడెపు సాయి కుమార్ ఎన్నికయ్యారు.

**ఎంఎస్పీ నూతన మండల కమిటీ:**
మండల అధ్యక్షుడిగా నాత్రి సమ్మయ్య, ఉపాధ్యక్షుడిగా ఆడెపు శ్రీనివాస్, అధికార ప్రతినిధిగా బొజ్జ లింగస్వామి, ప్రధాన కార్యదర్శులుగా ఆడెపు బిక్షపతి, నాత్రి శ్రీనివాస్, ఆడెపు సంపత్, శెనిగరపు కిరణ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు దండు అంజయ్య, దండు వరలక్ష్మి, కనుకుంట్ల శ్రీనివాస్, కలకోట సమ్మయ్య, మొరే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో పచ్చదనం పరిమళం

- **సామూహిక మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు**



**చట్టం / ఎల్లారెడ్డి :** పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఎల్లారెడ్డి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ ఆవరణలో మంగళవారం సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కమిషనర్ జగ్జీవన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది మొక్కలు నాటారు. మొక్క నాటడమే కాదు.. సంరక్షణే ముఖ్యం!: మొక్కలను నాటి వదిలేయకుండా నిరంతరం సంరక్షించి పెంచాలని కమిషనర్ జగ్జీవన్ సూచించారు. పచ్చదనం పెంపులో విద్యార్థులు సైతం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## రైతులు తప్పనిసరిగా పంట వివరాలు నమోదు చేసుకోవాలి : ఏవో హరీశ్ పవార్



**చట్టం నారాయణఖేడ్ :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండల పరిధిలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏవో హరీశ్ పవార్ సూచించారు. వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వానాకాలం పంటల వివరాలను డిజిటల్ క్రాప్ బుకింగ్ మొబైల్ యాప్ ద్వారా సర్వేయర్లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ క్లస్టర్ పరిధిలోని ఏఈఓను సంప్రదించి పంట వివరాలు నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు.

**పొలాలను సందర్శించి పంటల నమోదు**
ప్రభుత్వం నియమించిన పంట నమోదు సిబ్బంది రైతుల పొలాలను సందర్శించి సాగు చేసిన పంట రకం, సర్వే నంబర్, భూమి వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేస్తారని తెలిపారు. ఈ నమోదు ఆధారంగానే ప్రభుత్వం రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పంట నమోదు సిబ్బంది గ్రామాలకు వచ్చిన సమయంలో రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి సరైన వివరాలు అందించాలని కోరారు.

**వరి రైతులు బోనస్ కోసం వివరాలు నమోదు చేసుకోవాలి**
ధాన్యం సేకరణ సమయంలో బోనస్ పొందాలనుకునే వరి రైతులు సన్న రకాల విత్తనాలకు సంబంధించిన వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు BPT 5204 (సాంబ మసూరి), WGL 44 (సిద్ధి), KNM 1638 (కూనారం సన్నాలు), HMT జై శ్రీరామ్, KNM 7715, RNR 15048 (తెలంగాణ సోన) తదితర గుర్తింపు పొందిన సన్న రకాల విత్తనాలు కొనుగోలు చేసి ఉంటే డీలర్ పాయింట్ వద్ద వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. డీలర్ వద్ద నమోదు సమయంలో విత్తనాల కొనుగోలు బిల్లు, రైతు ఫోన్ నంబర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

**సొంత విత్తనాలు వాడిన రైతులకు సూచన**
గుర్తింపు పొందిన సన్న రకాలలో సొంత విత్తనాలు ఉపయోగించి సాగు చేసిన రైతులు బోనస్ పొందేందుకు స్వయంగా ప్రకటించిన ధ్రువీకరణ లేఖను సంబంధిత ఏఈఓకు సమర్పించాలని ఏవో హరీశ్ పవార్ సూచించారు. రైతులు పంట నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేసుకుని ప్రభుత్వ కొనుగోలు, బోనస్ ప్రయోజనాలు పొందాలని కోరారు.

## మీసన్‌పల్లిలో వనమహోత్సవం.. పచ్చదనమే ప్రగతికి బాట!

- **మొక్కలు నాటి సంరక్షించాలి.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: ఆర్ డి ఓ**



**చట్టం / ఎల్లారెడ్డి :** మండలంలోని మీసన్‌పల్లి రైతు వేదిక వద్ద మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ తహేరా బేగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్ డి ఓ ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రాంరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆర్ డి ఓ తో పాటు పలు అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ ప్రేమకుమార్, ఎంఏఓ , ఏపిఓ, సర్పంచ్ మైషయ్య, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

# చక్కెర తీపి కరిగింది.. సామాన్యుడి గుండెల్లో మంట పుట్టింది

- **నెల రోజుల వ్యవధిలో అమాంతం పెరిగిన ధరలు**
- **క్వింటాలుకు రూ.26 వేలకు పైగా ఎగబాకిన వైనం**
- **కిలో రూ.40 నుంచి రూ.80కి జంప్.. కిరాణాదారుల ఇష్టారాజ్యం**
- **నిఘా నీడ కరువై.. దోపిడీకి గురవుతున్న వినియోగదారులు**
- **వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని బాన్సువాడ ప్రజల ఆవేదన**

(**చట్టం ప్రతినిధి ఆసిఫ్ కామారెడ్డి**) "ఉదయం లేచింది మొదలు.. రాత్రి నిద్రపోయే వరకు నిత్య జీవితంలో మమేకమైన చక్కెర ధర ఒక్కసారిగా నింగిని తాకింది. నిత్యావసర వస్తువుల్లో అత్యంత ప్రధానమైన దీని ధరలకు రెక్కలు రావడంతో సామాన్యులు, పేద, మధ్యతరగతి వర్గాల బతుకు భారంగా మారింది. కిరాణా దుకాణదారుల ఇష్టారాజ్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి.. ఇప్పుడు వినియోగదారులపై పెనుభారాన్ని మోపుతున్నాయి."

**పెరిగిన ధరల వైనం ఇదీ..**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ ప్రాంతంలో చక్కెర ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. సరిగ్గా నెల రోజుల క్రితం వరకు క్వింటాలు చక్కెర ధర సుమారు రూ.42 వేల వరకు మాత్రమే ఉండేది. కానీ, ఏమైందో ఏమో కానీ.. వ్యాపార వర్గాల సిండికేట్ పుణ్యమా అని అదే క్వింటాలు ధర ప్రస్తుతం ఏకంగా రూ.68 వేలకు చేరింది! దీని ప్రభావం నేరుగా చిల్లర మార్కెట్‌పై తీవ్రంగా పడింది. గత నెల వరకు కిలో చక్కెర కేవలం రూ.40 నుంచి రూ.45 మధ్యలో లభించగా.. ప్రస్తుతం దుకాణదారులు దాన్ని రూ.70 నుంచి ఏకంగా రూ.80 వరకు అమ్ముతున్నారు. నెల రోజులు తిరగకుండానే ధర దాదాపు రెట్టింపు కావడంతో కొనుగోలుదారులు లబోదిబోమంటున్నారు.

సరిహద్దు రాకెట్.. దళారుల కబంధ హస్తాలు

కామారెడ్డి జిల్లాకు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి చక్కెర ప్రధానంగా సరఫరా అవుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతినెలా కేటాయించే కోటా మేరకు చక్కెర కర్మాగారాలు విక్రయాలు జరపాలి. అయితే, కొందరు పెద్ద వ్యాపారులు, దళారులు కుమ్మక్కై లారీల కొద్దీ నిల్వలను గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. మార్కెట్‌లో కృత్రిమ కొరత సృష్టించి.. ఆ భారాన్ని చివరకు చిల్లర వినియోగదారుడి నెత్తిన రుద్దుతున్నారనే తీవ్ర ఆరోపణలున్నాయి.

**'టీ' తాగాలన్నా భయమే!**

గ్రామీణ ప్రాంతాల్లో శ్రామికులు, రైతులు, సామాన్యుల దినచర్య టీతోనే ప్రారంభమవుతుంది. ఇక ఏ చిన్న శుభకార్యమైనా, ఇంటికి బంధువులు వచ్చినా తొలిచూపు టీ మీదే పడుతుంది. అలాంటిది పేదోడి పూట గడిచే ఆ గుప్పెడు చక్కెర ధర అమాంతం పెరగడంతో ఇళ్లల్లో బడ్జెట్ తలకిందులవుతోంది. ఇప్పటికే పప్పులు, నూనెలు, కూరగాయల ధరలతో అల్లాడిపోతున్న తమకు.. ఈ చక్కెర భారం మరింత కుంగదీస్తోందని ప్రజలు వాపోతున్నారు.

**అధికారుల జోక్యమేదీ?**

ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్న వ్యాపారుల తీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా



జిల్లా యంత్రాంగం, పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్‌లో ధరలను నియంత్రించి, పేదలకు అందుబాటు ధరలో చక్కెర లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యార్థులు నష్టపోకుండా బస్సు ట్రిప్పులు నడపాలని వినతి



**చట్టం న్యూస్ లింగంపేట్ :** కళాశాల విద్యార్థులకు అనుగుణంగా సరైన టైంలో ఆర్టీసీ అధికారులు బస్సు ట్రిప్పులు నడపాలని పోల్కంపేట్ గ్రామ సర్పంచ్ దివిటి రమేష్ మంగళవారం కామారెడ్డి ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ దినేష్ కుమార్ ను కలిసిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోల్కంపేట్ గ్రామానికి బస్సులు టైం కు రాకపోవడంతో ఉదయం సాయంత్రం కాలేజీ విద్యార్థులకు క్లాసులు మిస్ అవుతు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమయానికి బస్సులు నడపాలని కొరమన్నారు, అలాగే పోల్కంపేట్ ప్రయాణికులకు కూడా సాయంత్రం 3:30 తర్వాత బస్సులు రావడంలేదని గ్రామానికి వచ్చే ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రయాణికులు ఉదయం సుదూర ప్రాంతాలకు వెళ్లి తిరిగి వచ్చేసరికి లింగంపేట్ మండల కేంద్రం నుండి మూడున్నర గంటలకే ఆఖరి బస్సు ఉండడం వల్ల ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో మాదిరిగా సాయంత్రం లింగంపేట్ మండల కేంద్రంలో నుండి పోల్కంపేట వరకు ఆర్టీసీ బస్సును యధావిధిగా నడపాలని అన్నారు. ఈ విషయం పై మేనేజర్ కలిసి బస్సు సమస్యలను విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లలితా విట్టల్, కన్నపూర్ వార్డు సభ్యులు గండి గారి ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్‌లోకి వలసలు.. 15 మంది చేరిక

- **ఎదురుగట్ల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వివిధ పార్టీల నాయకులు**



**చట్టం/ ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రోజురోజుకు టీఆర్ఎస్‌కు బలం పెరుగుతోంది. నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన పలువురు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు మంగళవారం టీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాచాపూర్‌కు చెందిన సంపత్ గౌడ్, సంగారెడ్డి, మాచబోయిన పరమేష్, మాచబోయిన పోచయ్యతో పాటు సుమారు 15 మంది పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి సంపత్ గౌడ్ సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మర్రి బాలయ్య, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జైల్ సింగ్, మండల సీనియర్ నాయకులు బాబు, జగన్ రెడ్డి, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి తొలి పుట్టినరోజు వేడుకలు.. ఆశీర్వదించిన సుభాష్‌రెడ్డి




**చట్టం / ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు దేవునిపల్లికి చెందిన నాగం పరందాములు మనుమడి తొలి జన్మదిన వేడుకలు మెదక్‌లోని వెంకటేశ్వర గార్డెన్స్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎల్లారెడ్డి నియోజకవర్గ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకలో అభిమానులు, నాయకులు, బంధువులు, సన్నిహితులు పాల్గొని చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు.

## బాధితులకు సులభంగా రక్తదాన సేవలు

- **వైద్యో యాప్‌లో 'బ్లడ్ కనెక్ట్' ప్రారంభం**
- **రిజిస్టర్ అయిన డోనర్లకు నేరుగా సమాచారం**




**చట్టం నిజామాబాద్ ప్రతినిధి :** అత్యవసర సమయంలో రక్తం అవసరమైన బాధితులకు సులభంగా రక్తదాన సేవలు అందించేందుకు వైద్యో యాప్‌లో 'బ్లడ్ కనెక్ట్' సేవను ప్రారంభించినట్లు యాప్ నిర్వాహకులు తెలిపారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ మీను స్పందన, గుండె శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కార్తీక్ వల్లల ఈ సేవకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యాక్సిడెంట్, ఆపరేషన్, ప్రసవం వంటి అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైనప్పుడు డోనర్ల కోసం వాట్సాప్, సోషల్ మీడియా వేదికల్లో వెతకడం బాధిత కుటుంబాలకు ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. ముఖ్యంగా అరుదైన బ్లడ్ గ్రూపుల విషయంలో సరైన సమయంలో డోనర్‌ను గుర్తించడం మరింత కష్టమవుతోందన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా వైద్యో యాప్‌లో 'బ్లడ్ కనెక్ట్' సేవను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. పేషెంట్ యాప్‌లో అవసరమైన బ్లడ్ గ్రూప్, యూనిట్ల వివరాలతో రిక్వెస్ట్ నమోదు చేయగానే, అదే బ్లడ్ గ్రూప్‌తో యాప్‌లో రిజిస్టర్ అయిన డోనర్లకు సమాచారం చేరుతుందని వివరించారు. రక్తదానం చేసేందుకు స్పందించిన డోనర్ వివరాలను అవసరమైన పేషెంట్‌కు అందించడం ద్వారా త్వరగా రక్తం సమకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్లడ్ కనెక్ట్ సేవను పేషెంట్లకు పూర్తిగా ఉచితంగా సామాజిక సేవలో భాగంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. వైద్యో యాప్‌లో డాక్టర్ అపాయింట్‌మెంట్లు, డాక్టర్ సెర్చ్‌తో పాటు హోమ్ హెల్త్‌కేర్, ఫిజియోథెరపీ, నర్సింగ్ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఆపరేషన్స్ మేనేజర్ డాక్టర్ మోనిష్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ వంశీ సల్ల పాల్గొన్నారు.

## కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

- **9 కిలోల గంజాయితో యువకుడు అరెస్ట్ - ఎక్సైజ్, రైల్వే పోలీసుల సంయుక్త ఆపరేషన్**



(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్, రైల్వే టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో 9 కిలోల గంజాయి పట్టుబడింది. కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి ముకుంద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే టాస్క్ ఫోర్స్ నుంచి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది, రైల్వే టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. సికింద్రాబాద్ నుంచి నాందేడ్ వెళ్తున్న నాగవల్లి ఎక్స్‌ప్రెస్ (Train No.20811) లోని జనరల్ బోగీలో అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 5 ప్యాకెట్లలో 9 కిలోల ఎండు గంజాయి లభించింది. నిందితుడిని మధ్యప్రదేశ్‌కు చెందిన కిషన్ పటేల్ (20), తండ్రి లాల్జీ పటేల్‌గా గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు DPEO తెలిపారు. ఈ దాడులలో కామారెడ్డి ఎక్సైజ్ CI సంపత్ కృష్ణ , SI విక్రమ్ కుమార్, రైల్వే టాస్క్ ఫోర్స్ SI వెంకటేష్ బాబు, RPF ASI రవీంద్రబాబు, SI శ్రీనివాస్ రావు, ట్రైన్ ఎస్కార్ట్ సిబ్బంది మధు, అనిల్, రచన , సిబ్బంది HC ఫరీద్, బయ్యన్న, బాలసాహెబ్, కానిస్టేబుల్ పవన్, బాబు, రాజు, చంద్రశేఖర్, దివేష్, మీనాక్షి, నివాని, రమ తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా ఎరువుల బుకింగ్‌పై రైతులకు సమగ్ర అవగాహన

- **48 గంటల్లో ఎరువులు తీసుకోవాలి.. మళ్లీ బుకింగ్‌కు 15 రోజుల గడువు**



**చట్టం – మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని మాసాయిపేట మండల కేంద్రంలో రైతు వేదిక, స్థానిక ఎరువుల దుకాణాల వద్ద రైతులకు "ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (FFS)" యాప్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానంపై వ్యవసాయ అధికారులు సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాప్ వినియోగం, ఎరువుల బుకింగ్ ప్రక్రియ, రైతులు పాటించాల్సిన నిబంధనలపై అధికారులు వివరించారు. రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రీ పూర్తికాని రైతుల భూమి వివరాలు యాప్‌లో కనిపించవని తెలిపారు. భూమి వివరాలు కనిపించని రైతులు వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. గతంలో యూరియా బుకింగ్‌కు మాత్రమే అవకాశం ఉండగా, కొత్త విధానంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ సహా ఇతర ఎరువులను కూడా యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు. రైతులు ప్లే స్టోర్ నుంచి "Framework for Fertilizer Sale - FFS" యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ తెరిచిన తర్వాత తెలుగు లేదా ఇంగ్లీష్ భాషను ఎంపిక చేసుకోవచ్చు. ఆధార్ నంబర్ లేదా ఫార్మర్ ఐడీ నమోదు చేసి, మొబైల్‌కు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ కావాలి. లాగిన్ అనంతరం రైతుల భూమి వివరాలు, సర్వే నంబర్లు కనిపిస్తాయి. ఆయా సర్వే నంబర్లలో సాగు చేస్తున్న పంటలను నమోదు చేయాలి. పంట వివరాల ఆధారంగా అవసరమైన యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువుల పరిమాణాన్ని యాప్ సూచిస్తుంది. యాప్ సూచించిన పరిమాణంలో మొత్తం ఎరువులను లేదా అవసరానికి అనుగుణంగా తక్కువ పరిమాణాన్ని రైతులు బుక్ చేసుకోవచ్చు. అనంతరం కావాల్సిన ఎరువు రకం, కొనుగోలు చేయాలనుకున్న ఎరువుల దుకాణాన్ని ఎంపిక చేసి బుకింగ్ పూర్తి చేయాలి. బుకింగ్ పూర్తయిన తర్వాత రైతుకు క్యూఆర్ కోడ్, బుకింగ్ ఐడీ జనరేట్ అవుతాయి. ఆ క్యూఆర్ కోడ్‌ను సంబంధిత ఎరువుల దుకాణంలో చూపిస్తే వ్యాపారి స్కాన్ చేసి బుక్ చేసిన ఎరువులను అందజేస్తారు. బుకింగ్ చేసిన తర్వాత 48 గంటల్లోపు సంబంధిత దుకాణం నుంచి ఎరువులు తీసుకోవాలని అధికారులు తెలిపారు. నిర్ణీత సమయంలో తీసుకోకపోతే క్యూఆర్ కోడ్ గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. ఒకసారి ఎరువులు కొనుగోలు చేసిన రైతు 15 రోజుల తర్వాత మాత్రమే తిరిగి బుకింగ్ చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటికే యూరియా పొందిన రైతులు సంయమనం పాటించి, ఇతర రైతులకు కూడా యూరియా అందేలా సహకరించాలని అధికారులు కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కవిత, ఏఈఓ భార్గవ్ గౌడ్, ఆత్మ ఏటీఎం నరేందర్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

- **అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు**



**చట్టం – నిర్మల్ ప్రతినిధి :** జిల్లాలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని ఆడెల్లి పోచమ్మ హరితవనంలో మంగళవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా భారీ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అపర్ణ, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన మొక్కలను సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ప్రకృతితో మానవుడి అనుబంధం మరింత బలపడుతుందని చెప్పారు. మొక్కలు నాటడాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా యజ్ఞంలా భావించి, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలని కోరారు.

**ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి : ఎస్పీ జానకి షర్మిల**

జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మనం నాటిన మొక్కలు భవిష్యత్ తరాలకు ఉపయోగపడతాయని, విరివిగా మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడితేనే మానవాళి మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు, మహిళా సంఘాలు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు.

**అటవీ విస్తీర్ణం పెంపునకు అందరూ సహకరించాలి: సీసీఎఫ్ అపర్ణ**

బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అపర్ణ మాట్లాడుతూ, అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. భౌగోళిక విస్తీర్ణంలో కనీసం 33 శాతం అటవీ ప్రాంతం ఉండటం ద్వారా పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రజలు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పిల్లల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా అతిథులకు మొక్కలను బహుమతులుగా అందించే సంప్రదాయాన్ని ప్రోత్సహించాలని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కళాజాత బృందాలు సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాయి. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, విద్యార్థులు కలిసి పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీఎస్పీ శ్రీనివాస్, ఎంపీడీఓ లక్ష్మీకాంతరావు, ఎంపీఓ అజీజ్ ఖాన్, సర్పంచ్‌లు కూనేరు భూమన్న, దండు సాయన్న, స్థానిక ప్రజలు, విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి SBIలో పాము కలకలం

- **బ్యాంకు తెరవగానే ప్రత్యక్షం.. ఉద్యోగులు, ఖాతాదారుల్లో ఆందోళన**



**చట్టం/ ఎల్లారెడ్డి :** పట్టణంలోని SBI బ్యాంకులో మంగళవారం ఉదయం పాము కలకలం రేపింది. బ్యాంకు తెరిచిన వెంటనే లోపల పాము కనిపించడంతో ఉద్యోగులు, ఖాతాదారులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే రెస్క్యూ టీంకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న నిజాంసాగర్ మండలంలోని హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న సిరాజుద్దీన్ హుటాహుటిన బ్యాంకుకు చేరుకున్నారు. ఏమాత్రం బెదరకుండా రెస్క్యూ చేసి చాకచక్యంగా పామును పట్టుకుని డబ్బాలో బంధించారు. అనంతరం పామును సురక్షిత ప్రాంతంలో వదిలిపెడతామని తెలిపారు. పాము పట్టుబడటంతో బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఏకతాటిపై గౌడ సంఘం.. ప్రశాంత్ గౌడ్‌కు పగ్గాలు

- **ఆత్మీయ సమ్మేళనంలో ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక**



**చట్టం / ఎల్లారెడ్డి :** మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఐక్యతకు వేదికగా నిలిచింది. మండల గౌడ సంఘం గౌరవ అధ్యక్షులు సాయ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంగళవారం నూతన కమిటీని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడిగా ప్రశాంత్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా రఘువీర్ గౌడ్, ముఖ్య కార్యదర్శిగా ఉష గౌడ్, సహాయక కార్యదర్శిగా నారా గౌడ్, ముఖ్య సలహాదారుడిగా జగన్ గౌడ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుందన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు సంఘ ఐక్యత, గౌడ కుటుంబాల సంక్షేమం, సమష్టి అభివృద్ధికి కృషి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ గౌడ్, జీవన్ గౌడ్, సాయిబాబా గౌడ్, ఈశ్వర్ గౌడ్, కాష గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నరేందర్ గౌడ్, బాలరాజు గౌడ్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల గౌడ సంఘ సభ్యులు, గౌడ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్ పార్టీలోకి కొనసాగుతున్న భారీ చేరికలు



**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట్ మండలంలో టీఆర్ఎస్ పార్టీ లోకి చేరికలు కొనసాగుతున్నాయి, దీనితో పార్టీకి భారీగా బలం చేకూరతుంది. మంగళవారం టీఆర్ఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో లింగంపేట్ మండల పట్టణానికి చెందిన చెన్నం ఉషయ్య, రాజు, నాగయ్య, స్వామి, సాయిలు, రవి తో పాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 మంది కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో చేరారు, వారికి సంపత్ గౌడ్ పార్టీ కండువా కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పోకల సాయిరాం, మండల యూత్ అధ్యక్షులు మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు జైల్ సింగ్, జిల్లా ఎస్సీ సెల్ శ్రీకాంత్, గోవర్ధన్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బ్యాగరి సాయిలు, కృష్ణ గౌడ్, సెక్రటరీ మహేందర్, శ్రీకాంత్, రవి, ఆకుల సంగయ్య, రహూఫ్, ఖాజా, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెషర్స్‌కు ఫుల్ జోష్.. ఆటపాటలతో అదిరిన వేడుక

- **ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ**
- **విద్యార్థులకు అతిథుల దిశానిర్దేశం**




**చట్టం / ఎల్లారెడ్డి :** కొత్త అడుగులకు ఆత్మీయ స్వాగతం.. స్నేహాల సందడికి వేదికగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ పార్టీ ఉత్సాహంగా జరిగింది. విద్యార్థుల పాటలు, నృత్యాలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి సీఐ రాజిరెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు విద్యాసాగర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఈ. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. సీఐ రాజిరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించి పీజీతో పాటు ఉస్మానియా క్యాంపస్ వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాల్లో సీట్లు సాధించి ఉన్నత ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు విద్యాసాగర్ మాట్లాడుతూ... తక్కువ మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల నేడు పెద్ద సంఖ్యలో విద్యార్థులను ఆకర్షించడం అభినందనీయమన్నారు. పాటలు.. నృత్యాలు.. ఉత్సాహం: విద్యార్థుల ఆటపాటలు, నృత్య ప్రదర్శనలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. చంద్రకాంత్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ వి. శంకరయ్య, టీఎస్‌కేసీ సమన్వయకర్త శివకుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఘన ఏర్పాట్లు

- **విగ్రహ దాత సాయి సుధాకర్ రెడ్డి**
- **భక్తులందరూ పాల్గొనాలని సర్పంచ్ వంగ నీలిమ సాయ గౌడ్ పిలుపు**



**చట్టం న్యూస్ – మోస్రా :** నిజామాబాద్ జిల్లా మోస్రా మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో వీరభద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతిష్ఠాపన కోసం వీరభద్ర స్వామి విగ్రహాన్ని దాత సాయి సుధాకర్ రెడ్డి అందజేశారు. బుధవారం ఉదయం నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి చింతకుంట గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని గ్రామ సర్పంచ్ వంగ నీలిమ సాయ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రతిష్ఠాపన కార్యక్రమం అనంతరం భక్తుల కోసం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిలు తెలిపారు. భక్తులందరూ అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని వేడుకను విజయవంతం చేయాలని కోరారు. గ్రామ ప్రజలు, భక్తుల సహకారంతో వీరభద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# తగిలేపల్లి మాజీ సర్పంచ్ వెంకన్న హత్యకు నిరసనగా వర్ని చౌరస్తాలో భారీ ధర్నా

- హత్యా రాజకీయాలకు చరమగీతం పాడాలి..
- బాన్సువాడలో శాంతి, సామరస్యం వర్ధిల్లాలి: పోచారం భాస్కర్ రెడ్డి



**చట్టం న్యూస్ – మోస్రా :** నిజామాబాద్ జిల్లా వర్ని మండలం తగిలేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మైసమ్ వెంకటేశ్వర్లు (వెంకన్న) హత్యకు నిరసనగా, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వర్ని చౌరస్తాలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో నియోజకవర్గ నాయకులతో కలిసి మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, వెంకన్న హత్య ఘటన తీవ్రంగా కలచివేసిందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో హత్యలు, హింసాత్మక రాజకీయాలకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా కొందరు నాయకులు, కార్యకర్తలు ఏనుగు రవీందర్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హత్య ఘటనకు సంబంధించి ఆయన అనుచరుడిగా పేర్కొంటున్న బక్క నారాయణ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు నాయకులు తెలిపారు. ఘటన వెనుక ఉన్న పూర్తి వివరాలను పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి వెల్లడించాలని పోచారం భాస్కర్ రెడ్డి కోరారు. గతంలో ప్రశాంతంగా ఉన్న బాన్సువాడ నియోజకవర్గంలో హింసాత్మక ఘటనలకు స్థానం ఉండకూడదన్నారు. బాన్సువాడ ఎప్పటికీ శాంతి, సామరస్యాలకు నిలయంగా కొనసాగాలని, హింస, హత్యా రాజకీయాలు, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో భయాన్ని కలిగించే రాజకీయాలకు స్వస్తి పలకాలని, హింసను ప్రోత్సహించే రాజకీయ విధానాలను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు తిరస్కరించాలని కోరారు.

**భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు**

ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వెంకన్న హత్యను ఖండిస్తూ బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలి.
- మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





**చట్టం మెదక్ ప్రతినిధి :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మహిళా మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో డీఎఫ్ఓ, జోజీ, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి తో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో వన మహోత్సవం కింద 31 లక్షల 95 మొక్కలు నాటాలని లక్ష్యం కాగా, ఇప్పటివరకు .19 లక్షల 43వేల 654 మొక్కలు నాటి .60.83 %.శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు విద్యార్థినులు అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నగుండవెల్లి పాఠశాలలో కలెక్టర్ హైమావతి ఆకస్మిక తనిఖీ

- మధ్యాహ్న భోజన నాణ్యత పరిశీలన.. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించిన కలెక్టర్



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట రూరల్ మండలం చిన్న గుండవెల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆహార నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం సిద్ధం చేసిన అన్నం, వంకాయ-ఆలుగడ్డ కూర, పప్పుచారును పరిశీలించారు. కూరల నాణ్యత బాగుందని సిబ్బందిని అభినందించారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన కలెక్టర్ స్వయంగా వారి ప్లేట్లలో అన్నం, కూరలు వడ్డించారు. విద్యార్థులు భోజనం చేసేటప్పుడు ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయం అందించాలని సూచించారు. చిన్నారులు ఆహారాన్ని వృథా చేయకుండా, సక్రమంగా తీసుకునేలా చూడాలని తెలిపారు. పాఠశాల వాతావరణం పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉందని కలెక్టర్ ప్రశంసించారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి మౌలిక నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. పాఠశాలను ఇదే విధంగా అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు. అనంతరం ప్లే స్కూల్ గదిని పరిశీలించిన కలెక్టర్ చిన్నారులు ఆడుకునేందుకు, కూర్చునేందుకు ఏర్పాటు చేసిన వివిధ సామగ్రిని పరిశీలించారు. రంగురంగుల వస్తువులు, ఆట వస్తువులతో పిల్లలు ఆసక్తిగా ఆడుకుంటారని, ఆట సమయంలో వారు పడిపోకుండా, గొడవలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు.

# తగిలేపల్లి మాజీ సర్పంచ్ హత్యకు నిరసనగా వర్ని చౌరస్తాలో ధర్నా

- ఏనుగు రవీందర్ రెడ్డి అనుచరుడే నిందితుడు : పోచారం భాస్కర్ రెడ్డి ఆరోపణ



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** వర్ని మండలం తగిలేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మైసమ్ వెంకటేశ్వర్లు (వెంకన్న) హత్యకు నిరసనగా వర్ని చౌరస్తాలో సోమవారం ధర్నా నిర్వహించారు. మాజీ డీసీసీబీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

**భాస్కర్ రెడ్డి ఏమన్నారంటే..**

ఈ సందర్భంగా పోచారం భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సర్పంచ్ వెంకన్న హత్య తీవ్రంగా కలచివేసిందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో హత్యా రాజకీయాలకు, హింసకు తావు లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గతంలో ప్రశాంతంగా ఉన్న బాన్సువాడలో వలస నాయకుల రాజకీయ జోక్యంతో హింస, అలజడి పెరిగిందని ఆరోపించారు. అదే గ్రామానికి చెందిన బక్క నారాయణ ఈ ఘటనలో నిందితుడిగా పోలీస్ స్టేషన్ లో లొంగిపోయారని, ఆయన ఏనుగు రవీందర్ రెడ్డి ప్రధాన అనుచరుడని భాస్కర్ రెడ్డి ఆరోపించారు. ఈ ఘటన వెనుక ఉన్న పూర్తి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. బాన్సువాడ నియోజకవర్గం ఎప్పుడూ శాంతి, సామరస్యాలకు నిలయమని, ఇక్కడ హింసకు, హత్యా రాజకీయాలకు, భయభ్రాంతులకు ఎలాంటి స్థానం ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజల్లో భయాన్ని కలిగించే రాజకీయాలకు స్వస్తి పలకాలని, హింసను ప్రోత్సహించే రాజకీయ నాయకత్వాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ధర్నా సందర్భంగా కార్యకర్తలు "హత్యా రాజకీయాలను ప్రోత్సహించే నాయకుడు ఏనుగు రవీందర్ రెడ్డి డౌన్ డౌన్, హత్యా రాజకీయాలు నశించాలి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# ప్రమాద రహిత రహదారులే లక్ష్యం

- కలెక్టర్ ప్రతిమా సింగ్



**చట్టం – మెదక్ ప్రతినిధి :** ప్రమాద రహిత రహదారుల లక్ష్యంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్, ప్రమాదాల నివారణ చర్యలు, పీఎం రాహత్, పీఎం రహవీర్ పథకాల అమలు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రజల ప్రాణాలను కాపాడటం అత్యంత ప్రధాన బాధ్యతగా భావించి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించేందుకు పీఎం రాహత్ పథకం కింద రూ.1.50 లక్షల వరకు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ సదుపాయం అందుబాటులో ఉందని తెలిపారు. ప్రమాదం జరిగిన ఏడు రోజులలోపు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సహకారంతో ఎఫ్ఐఆర్ కాపీ తదితర పత్రాలతో దరఖాస్తు చేసుకునే విధానంపై అధికారులకు సూచనలు చేశారు. పీఎం రహవీర్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో సహాయం చేసి ప్రాణాలు కాపాడేందుకు కృషి చేసిన వారికి రూ.25 వేల రివార్డు పొందేందుకు దరఖాస్తు చేసుకునే విధానంపై సమావేశంలో చర్చించారు. రోడ్డు భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాల్లో అవసరమైన సూచిక బోర్డులు, భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి మెదక్ జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ శంకర్, నేషనల్ హైవే765 డీజీ కరుణాకర్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్నకుమార్, డీటీఓ శ్రీకాంత్ చక్రవర్తి, ఎస్బీసీఐ సందీప్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, ఇంటర్మీడియట్ అధికారి మాధవి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ముధోల్ నియోజకవర్గంలో రైస్ మిల్లులపై విజిలెన్స్ విస్తృత తనిఖీలు

- ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో భారీ లోటు గుర్తింపు
- తనిఖీల సమయంలో అందుబాటులో లేని మిల్లుల నిర్వాహకులు
- ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అధికారుల హెచ్చరిక



**చట్టం – భైంసా :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గ పరిధిలోని రైస్ మిల్లులపై ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం నిల్వలు పక్కదారి పట్టినట్లు వచ్చిన సమాచారంతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు మిల్లులపై నిఘా పెంచాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైస్ మిల్లులకు కేటాయించిన ప్రభుత్వ ధాన్యం నిల్వలపై తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో నిర్మల్ జిల్లాలోనూ అధికారులు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా మంగళవారం భైంసా, లోకేశ్వరం ప్రాంతాల్లోని రైస్ మిల్లుల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

**శ్రీరామ రైస్ మిల్లులో భారీ లోటు**

అధికారుల వివరాల ప్రకారం, దేగాం ప్రాంతంలోని శ్రీరామ రైస్ మిల్లుకు 2022-23 సంవత్సరానికి 5,922 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యం కేటాయించారు. తనిఖీల సమయంలో మిల్లులో కేవలం 716 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అందుబాటులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. మిగిలిన ధాన్యం నిల్వల్లో భారీ లోటు ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించిన అధికారులు, అందుబాటులో లేని ధాన్యం విలువ సుమారు రూ.11.64 కోట్లకు పైగా ఉండవచ్చని పేర్కొన్నారు. ఈ రైస్ మిల్లు వంగ సుశీల పేరుతో ఉండగా, నిర్వహణ బాధ్యతలను వంగ మహేందర్ రెడ్డి చూస్తున్నట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైనట్లు సమాచారం. తనిఖీల సమయంలో సంబంధిత నిర్వాహకుడు అధికారులకు అందుబాటులో లేనట్లు తెలిసింది.

**సీతారామ రైస్ ఇండస్ట్రీలోనూ నిల్వల లోటు**

లోకేశ్వరం మండలం పుస్పూర్ శివారులోని సీతారామ రైస్ ఇండస్ట్రీలో కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ మిల్లుకు ప్రభుత్వ పథకం కింద 6,360 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, దాని విలువ సుమారు రూ.16.39 కోట్లుగా అధికారులు పేర్కొన్నారు. తనిఖీల సమయంలో మిల్లులో కేవలం 25,575 ధాన్యం బస్తాలు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దీంతో సుమారు రూ.14.10 కోట్ల విలువైన ధాన్యం నిల్వలు అందుబాటులో లేనట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

**సివిల్ సప్లై అధికారులకు నివేదిక**

రెండు రైస్ మిల్లుల్లో నిర్వహించిన తనిఖీలకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సిద్ధం చేసి పౌరసరఫరాల శాఖ అధికారులకు అందజేయనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. "ప్రభుత్వ ధాన్యం విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. తనిఖీల్లో అక్రమాలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవు" అని అధికారులు పేర్కొన్నారు. ముధోల్ నియోజకవర్గంలోని మరికొన్ని రైస్ మిల్లుల్లో కూడా తనిఖీలు కొనసాగనున్న నేపథ్యంలో మిల్లర్లలో ఆందోళన నెలకొంది. ఎలాంటి ప్రలోభాలకు తావివ్వకుండా నిబంధనల ప్రకారం తనిఖీలు కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

# ఆర్జీయూకేటీ బాసరలో విద్యార్థులకు ఆన్‌లైన్ ధ్రువపత్రాల సేవలు ప్రారంభం



**చట్టం, బాసర :** రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ట్రిబుల్ ఐటీ బాసర ప్రాంగణం విద్యార్థుల కోసం 'ఆర్జీయూకేటీ హబ్' ద్వారా నూతన ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ధ్రువపత్రాల సేవల కోసం దూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలకోర్చి వచ్చే విద్యార్థులకు ఇది సౌకర్యవంతంగా ఉంటుంది, అలాగే విద్యార్థినీల సురక్షతకు ఈ సేవలు ఉపయోగకరంగా ఉంటాయి. విశ్వవిద్యాలయానికి నేరుగా రావలసిన అవసరం లేకుండా సర్టిఫికేట్లకు దరఖాస్తు చేసుకోవడం నుండి పొందే వరకు ప్రక్రియను అత్యంత సులభంగా, వేగవంతంగా పూర్తి చేయడానికి ఈ డిజిటల్ విధానాన్ని ప్రారంభించారు. ఈ నూతన విధానంలో రెండు ముఖ్యమైన ఆన్‌లైన్ సేవలను చేర్చారు. మొదటిది 'ఆన్‌లైన్ నోడ్యూ సర్టిఫికేట్' (SNDC). దీని ద్వారా విద్యార్థులు లైబ్రరీ, క్రీడల విభాగం, ల్యాబ్‌లు, హాస్టల్, చీఫ్ వార్డెన్ కార్యాలయం, స్కాలర్‌షిప్, ఫైనాన్స్, పూర్వ విద్యార్థుల (అల్యూమ్ని) విభాగాల నుండి పొందాల్సిన క్లియరెన్స్ ప్రక్రియను డిజిటల్ పద్ధతిలోనే దరఖాస్తు చేసుకుని పరిశీలించుకోవచ్చు. రెండవది 'ఆన్‌లైన్ సర్టిఫికేట్ రిక్వెస్ట్' (OCR). ఈ సేవల కింద బోనాఫైడ్, కండక్ట్, బదిలీ ప్రమాణపత్రం (టీసీ), కస్టోడియన్, గ్రేడ్ కార్డ్, ట్రాన్స్‌క్రిప్ట్, మార్కుల మెమో, మైగ్రేషన్, ప్రొవిజనల్, డిగ్రీ సర్టిఫికేట్లు, నకిలీ ధ్రువపత్రాల కోసం ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థులు రుసుమును ఆన్‌లైన్‌లో చెల్లించి, ధ్రువపత్రాలను పోస్ట్ ద్వారా లేదా నేరుగా వచ్చి తీసుకునే సౌకర్యాన్ని ఎంచుకోవచ్చు. దరఖాస్తు ఏ దశలో ఉందో ప్రత్యక్షంగా (లైవ్ ట్రాకింగ్) తెలుసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. ప్రాథమికంగా, ప్రస్తుతం ఉత్తీర్ణులైన B20 బ్యాచ్ విద్యార్థులను వాళ్ళ యొక్క ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వారికి ప్రాధాన్యత ఇస్తూ, వారి బ్యాచ్ తోనే ఈ సేవలు ప్రారంభించారు. త్వరలోనే మిగిలిన బ్యాచ్‌ల విద్యార్థులకు కూడా ఈ సేవలను విస్తరించనున్నారు. ఇదివరకే భౌతికంగా (మాన్యువల్‌గా) ధ్రువపత్రాల కోసం దరఖాస్తులు సమర్పించిన విద్యార్థులు మళ్లీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయనవసరం లేదు, వారి పాత దరఖాస్తులను యథావిధిగా పరిశీలించి ధ్రువపత్రాలు అందజేస్తారు. విద్యార్థులు [https://hub2.rgukt.ac.in](https://www.google.com/search?q=https://hub2.rgukt.ac.in) వెబ్‌సైట్‌లో తమ ఐడీ వివరాలతో లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి పేజీలో వివరణాత్మక గైడెన్స్ మ్యాన్యువల్ అందుబాటులో ఉంటుంది. సందేహాలు లేదా సాంకేతిక సాయం కోసం పరీక్షల విభాగాన్ని సంప్రదించవచ్చు లేదా techsupport@rgukt.ac.in ఈమెయిల్ ద్వారా సేవలు పొందవచ్చు. ఈ వివరాలను అకాడమిక్ అండ్ ప్లానింగ్ అసోసియేట్ డీన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, స్కాలర్‌షిప్ విభాగం అధికారులు సంయుక్తంగా విడుదల చేశారు.

# సైబర్ మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండండి: సీఐ




**చట్టం నారాయణఖేడ్ :** సంగారెడ్డి జిల్లా కంగ్టి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ మోసగాళ్ల చేతిలో రూ.97 వేలు పోగొట్టుకున్నట్లు సీఐ వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రధాని యోజన పథకం పేరుతో వచ్చిన ఫేక్ ఏపీకే ఫైల్ను డౌన్లోడ్ చేయడంతో విడతల వారీగా నగదు కాజేశారని చెప్పారు. బాధితుడు 1930కు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తుతెలియని లింకులు, ఫైళ్లను డౌన్లోడ్ చేయవద్దని ప్రజలను హెచ్చరించారు.

# మల్కాపూర్ చాలా అద్భుతంగా ఉంది




**చట్టం, తూప్రాన్;** మల్కాపూర్ చాలా అద్భుతంగా ఉందని కితాబిచ్చారు లయోలా కాలేజ్ స్టడీ టూర్ విద్యార్థులు. గత 10 ఏళ్ల లో గ్రామంలో జరిగిన అభివృద్ధిని సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, మేకిన్ అధ్యక్షుడు కరుణాకర్ లు విద్యార్థులకు వివరించారు. అంతకుముందు పల్లె ప్రకృతి వనం, నర్సరీ, డంపింగ్ యార్డ్, రాక్ గార్డెన్, కమ్యూనిటీ భవనాన్ని సందర్శించారు. గ్రామంలో చేపడుతున్న కార్యక్రమాలు చాలా అద్భుతంగా ఉన్నాయని వారు పేర్కొన్నారు, అనంతరం పాఠశాలను సందర్శించి విద్యా బోధనపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వన మహోత్సవంలో భాగంగా విద్యార్థులు ఫారెస్ట్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామ అభివృద్ధిలో యువత పాత్ర అద్భుతమని కొనియాడారు, సర్పంచ్ పర్యవేక్షణలో గ్రామం మరింత అభివృద్ధి మార్గంలో ముందుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, ఎంపీ ఓ సతీష్, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, లయోలా కళాశాల హెచ్ ఓ డి షఫీక్ సాగర్ ,ప్రొఫెసర్స్ వాణి, భవాని,మధు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు జిన్న కృష్ణ, మన్నె తిరుపతి, పిట్ల వేణు, కృష్ణ ముదిరాజ్, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# వన మహోత్సవంలో మొక్కలు నాటిన అధికారులు




**చట్టం, తూప్రాన్;** వన మహోత్సవం లో భాగంగా తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామ అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అధికారులతో కలిసి సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సర్పంచ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, బీట్ ఆఫీసర్ చిరంజీవి, కార్యదర్శి మహేశ్వరి, పాలకవర్గ సభ్యులు రేఖ నాగరాజు గౌడ్ , జిన్న కృష్ణ, పిట్ల వేణు, మన్నె తిరుపతి, కృష్ణ ముదిరాజ్ ,టెక్నికల్ అసిస్టెంట్ సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ కనకరాజు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో ఘనంగా మిలాద్‌ఉన్‌నబీ వేడుకలు

- రక్తదాన శిబిరం మానవత్వానికి నిదర్శనం



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** ప్రవక్త హజ్రత్ మహమ్మద్ ముస్తఫా (సల్లల్లాహు అలైహి వసల్లం) జయంతి మిలాద్‌ఉన్‌నబీ వేడుకలను కామారెడ్డి పట్టణంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని చారిత్రాత్మక మదీనా మసీదు వద్ద ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం అందరి ప్రశంసలు అందుకుంది. 'సేవయే దైవ సేవ' అనే దివ్య సందేశానికి నిదర్శనంగా ఈ శిబిరం నిలిచింది. ప్రవక్త బోధించిన ప్రేమ, కరుణ, సోదరభావ సందేశాన్ని ఆచరిస్తూ స్థానిక యువత, జమాత్ సభ్యులు పెద్ద సంఖ్యలో రక్తదానం చేశారు. ఒక ప్రాణాన్ని కాపాడటం సమస్త మానవాళిని కాపాడటంతో సమానమన్న ప్రవక్త సందేశంతో స్ఫూర్తి పొంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సేకరించిన రక్తాన్ని అత్యవసర వైద్య సేవలకు, తలసేమియా బాధిత చిన్నారులకు, పేద రోగులకు అందజేయనున్నారు. మిలాద్‌ఉన్‌నబీ అంటే కేవలం వేడుకలు మాత్రమే కాదని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే నిజమైన భక్తి అని మదీనా మసీదు నిర్వహణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. రక్తదాతల ఉత్సాహంతో మసీదు ఆవరణ మానవత్వానికి నిలయంగా మారింది. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, మసీదు కమిటీ నాయకులు, స్వచ్ఛంద రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రహదారి నిర్మాణం కోసం ఆగస్టు 31న బీఆర్ఎస్ పాదయాత్ర

- వెల్దుర్తి నుంచి మెదక్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర
- ప్రధాన రహదారి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్
- రూ.18 కోట్ల నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదని బీఆర్ఎస్ ఆగ్రహం



**చట్టం – వెల్దుర్తి ప్రతినిధి :** వెల్దుర్తి మండల కేంద్రం నుంచి మెదక్ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 31న వెల్దుర్తి నుంచి మెదక్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. వెల్దుర్తి-మెదక్ ప్రధాన రహదారిపై తారు తొలిగిపోయి పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రహదారి మరమ్మతుల కోసం రూ.18 కోట్లు మంజూరు చేసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం పనులను ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. వర్షాల కారణంగా రహదారిపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు అదుపుతప్పి పడిపోతూ గాయాలపాలవుతున్నారని, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రులకు వెళ్లే ప్రజలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆగస్టు 31న వెల్దుర్తి మండల కేంద్రం నుంచి మెదక్ కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి, అనంతరం ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రమేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ మోహన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు అశోక్ గౌడ్, గుత్తి మైసయ్య, సీనియర్ నాయకుడు అశోక్ రెడ్డి, మాజీ సర్పంచులు, ప్రస్తుత సర్పంచులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com